
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పనుల్లో నాణ్యతను పరీక్షించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడాల్సిన క్వాలిటీ కంట్రోల్ విభాగం... అవినీతి సంపాదనకు అలవాటు పడి కంట్రోల్ తప్పింది. ఒకటి, రెండు కాదు.. కొన్ని వందల సర్టిఫికెట్లను క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించకనే జారీ అయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో ఇద్దరు అధికారులు ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని శాసించారు. అప్పట్లో వైసీపీ నేతలు చెప్పిందల్లా చేస్తూ ప్రజాధనాన్ని దోచిపెట్టడంలో భాగస్వాములయ్యారు. పనులు చేయకుండానే ఇరిగేషన్ ఇంజనీర్లు బిల్లులు పెట్టగా, ఆ బిల్లు రావడమే తడవుగా క్వాలిటీ కంట్రోల్ అధికారులు సర్టిఫికెట్లు జారీచేశారు. తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా ప్రజాధనాన్ని వైసీపీ నేతలు, ఇరిగేషన్ ఇంజనీర్లతో కలిసి క్వాలిటీ కంట్రోల్ అధికారులు పంచుకున్నారన్న ఆరోపణలున్నాయి. తాజాగా ప్రభుత్వం మారడంతో ఇరిగేషన్ శాఖలోని బిల్లులన్నీ వెనక్కు వస్తున్నాయి. మరి వీటికి క్యూసీ సర్టిఫికెట్లు ఎలా జారీ చేశారన్నది అనుమానంగా మారింది. నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో క్వాలిటీ కంట్రోల్ విభాగం జారీ చేసిన సర్టిఫికెట్లపై విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

- కంట్రోల్ తప్పిన 'క్వాలిటీ'
- అవినీతిమయంగా ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్ విభాగం
- గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా సర్టిఫికెట్ల జారీ
- క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన చేయకనే ధ్రువీకరణ
- క్యూసీ సర్టిఫికెట్లనే ట్యాంపరింగ్ చేసిన ఘనులు
- వివాదాస్పదంగా ఇద్దరు అధికారుల తీరు
- ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు.. మంత్రి నిమ్మల దృష్టికి అక్రమాలు

పనులు మిథ్య.. నాణ్యత డొల్ల !

నిజంగా పనులు జరిగాయా..?

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కాలువలను బాగు చేసేందుకు రూ.వందల కోట్లు ఖర్చు చేసినట్లు చూపిస్తున్నారు. కానీ ఎక్కడా కూడా కాలువలు బాగు చేసినట్లు కనిపించలేదు. ఓఅండ్ఎం, ఎఫ్‌డీఆర్ మాటును రూ.వందల కోట్ల పనులు జరిగాయి. కానీ ఇప్పుడు ఆ పనులు జరిగిన ప్రదేశాలను పరిశీలిస్తే అసలు ఇక్కడ పనులు జరిగాయా..? అన్న అనుమానం కలగకమానదు. కాలువల్లో పూడిక తీయకుండానే తీసినట్లు రికార్డు చేసి బిల్లులు తినేశారు. ఆఖరుకు కాంక్రీట్ వర్కుల్లోనూ వైసీపీ నేతల ఒత్తిళ్లకు అధికారులు బరితెగించారు. షట్టర్లు, స్లూయిజ్‌లు వంటివి ఏర్పాటు చేయకుండానే చేసినట్లుగా బిల్లులు రికార్డు చేశారు. కనుపూరు కాలువ, నక్కల కాలువ వంటి వాటిల్లో రూ.పదుల కోట్లలో పనులు జరిగినట్లు రికార్డు చేశారు. ఎఫ్‌డీఆర్ పనులు చేయకుండానే చేసినట్లుగా బిల్లులు తినేసినట్లు అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో ఆయన అంతర్గతంగా విచారణ చేయించుకొని వాస్తవాలను నిర్ధారించుకున్నారు. ఈ కారణం చేతనే ఆ మరుసటి ఏడాది ఒక్క రూపాయి కూడా ఎఫ్‌డీఆర్ పనులు మంజూరు చేయలేదు. వైసీపీ ప్రభుత్వంలో చివరి ఏడాదిలో లెక్కకు మించి ఓఅండ్ఎం పనులు మంజూరు చేయించుకున్నారు. సీజన్ మధ్యలో అనుమతులు తెచ్చి ఆ తర్వాత తూతూ మంత్రంగా పనులు చేసి బిల్లులు రికార్డు చేశారు. ఇలా అనుమతులు రావడం, అలా అగ్రిమెంట్లు చేయడం, ఆ వెంటనే పనులు పూర్తయినట్లు బిల్లులు రికార్డు చేయడం.. తదితర పనులన్నీ చకచకా జరిగిపోయాయి. ఈ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి క్వాలిటీ కంట్రోల్ అధికారులు సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉంది. అయితే ఎంబుక్ రికార్డు చేయడమే ఆలస్యం వీరు సర్టిఫికెట్లు జారీ చేసేశారు. ఈ సర్టిఫికెట్లు జారీ చేయడంలో ఒక ప్రొసీజర్ ఫాలో అవ్వాల్సి ఉంది. ఎర్త్ వర్కులు అయితే లెవల్స్ తీయాలి. కాంక్రీట్ వర్కులు అయితే వాటి కోర్ తీసి ల్యాబ్‌లకు పంపాలి. కానీ చాలా వరకు ఇవేవీ జరగలేదు. అసలు లెవల్స్ కొలతలు తీయకుండానే క్యూసీ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు ఆరోపణలున్నాయి. తాజాగా ప్రభుత్వం మారడంతో ఇరిగేషన్ శాఖలో జరిగిన అవినీతిపై ఎమ్మెల్యేలు దృష్టి పెట్టారు. చాలా వరకూ పనులు చేయకుండానే బిల్లులు పెట్టాల్సి వచ్చిందని ఇరిగేషన్ అధికారులు ఒప్పుకోవడంతో ఆ బిల్లులన్నీ ఇప్పుడు వెనక్కు వస్తున్నాయి. మరి ఈ వర్కులకు క్వాలిటీ కంట్రోల్ విభాగం సర్టిఫికెట్లు ఎలా జారీ చేసిందన్న ప్రశ్న ఇప్పుడు తలెత్తుతోంది.



ఆ ఇద్దరే అంతా...!

ఇరిగేషన్ శాఖలో జరిగే అన్నీ వర్కుల నాణ్యతను పరిశీలించేందుకు క్వాలిటీ కంట్రోల్ డివిజన్ నెల్లూరులో ఉంది. ఓ ఈఈతోపాటు నెల్లూరు, కలువాయిల్లో డీఈఈ కార్యాలయాలు ఉన్నాయి. వీరి కింద పలువురు ఏఈఈలు పనిచేస్తున్నారు. వర్కు స్థాయి, జరిగిన పనులను బట్టి ఈఈ నుంచి ఏఈఈ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వంలో కార్యాలయాల నుంచి అడుగు బయటపెట్టకుండానే చాలావరకు సర్టిఫికెట్లు జారీ అయ్యాయన్న ప్రచారం ఉంది. గత ఐదేళ్లలో ఇద్దరు అధికారులే క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని శాసించారు. మొదట మూడేళ్ల ఒకరు, ఆ తర్వాత రెండేళ్లు మరొకరు ఇష్టారీతిన వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. మరీ ముఖ్యంగా చివరి రెండేళ్లలో అయితే తిరుపతిలో పనిచేసే ఓ అధికారి నెల్లూరులో క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇన్‌చార్జిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఆయన ఓ ఈఎన్‌సీకు సన్నిహితుడు కావడంతో ఆయన ఆడిందే ఆటగా సాగినట్లు ఇరిగేషన్ శాఖలో చెప్పుకుంటున్నారు. సదరు అధికారి తిరుపతి నుంచి నెల్లూరుకు పనుల పరిశీలనకు వచ్చారంటే ఆయనకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సపర్యలు చేసే బాధ్యత కాంట్రాక్టర్లు తీసుకోవాల్సి ఉంటుంది. సదరు అధికారి పదవీ విరమణ దగ్గర పడుతున్న కొద్దీ మరీ విచ్చలవిడిగా వ్యవహరించినట్లు చెప్పుకుంటున్నారు. ఇక మరో అధికారి అయితే ఏకంగా ఒకసారి జారీ చేసిన క్యూసీ సర్టిఫికెట్‌ను ట్యాంపరింగ్ చేశారంటే అక్కడ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇరిగేషన్ సర్కిల్ పరిధిలోని ఓ ప్యాకేజీ ప్రీక్లోజ్‌కు సంబంధించి మొదట రూ.14 కోట్లతో క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ జారీ చేయగా, ఏడాదన్నర తర్వాత ఆ మొత్తాన్ని కొట్టేసి రూ.18 కోట్లుగా సర్టిఫికెట్లో మార్చారు. దీని గురించి తెలిసిన పెద్ద పెద్ద ఇంజనీర్లే సదరు అధికారి తీరుపై ముక్కున వేలేసుకుంటు న్నారు. ఇలా గత ఐదేళ్లలో క్యూసీ విభాగంలో భారీ అవినీతి జరిగినట్లు ఆరోపణలు వెల్లువె త్తుతు న్నాయి. పనులు చేయకపోయినా క్యూసీ సర్టిఫికెట్లు జారీ చేయడంపై ఇటీవల కొందరు ఎమ్మెల్యే లకు ఫిర్యాదు చేశారు. ఈ వారంలో ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లాకు రానుండ డంతో ఇరిగేషన్ శాఖలో గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలన్నింటినీ ఆయన దృష్టికి తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నారు.

ఎవరా సీనియర్ సహాయకుడు ?

- ఆంధ్రజ్యోతి కథనంపై అధికారుల ఆరా

నెల్లూరు(సిటీ), జూలై 7 : నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో నగదు వసూళ్లకు పాల్పడుతున్న ఆ సీనియర్ సహాయకుడు ఎవరు...? ఇప్పటి వరకు అతడికి ఎవరెవరు డబ్బులు ఇచ్చారు... ఎంతిచ్చారు.. ఎందరుకిచ్చారు...? అన్న కోణాల్లో కార్పొరేషన్ ఉన్నతాధికారులు అంతర్గత విచారణ చేపట్టినట్లు తెలిసింది. తాజాగా ఫోర్జరీ సంతకాల స్కాంలో సస్పెండ్ అయిన ఇద్దరు చిరుద్యోగుల నుంచి రూ. లక్ష చొప్పున నగదు వసూలు చేయడంపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై అధికారులు కూపీ లాగుతు న్నారు. గతంలో ఇద్దరు ఉద్యోగుల వద్ద నగదు వసూలు చేయడంపైన కూడా ఆరా తీస్తున్నారు. కాగా ఆరోగ్య విభాగంతో సంబంధాలున్న, పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులకు చార్జ్‌మెమోలు జారీచేయడాన్ని ఈ ఘనుడు అవకాశంగా మలుచు కున్నాడు. వారిపై తదుపరి చర్యలు తీసుకోకుండా, తాను చూసుకుంటానంటూ నగదు వసూళ్లకు పాల్పడ్డట్లు తాజా సమాచారం.

ఆల్తుర్తిలో అయ్యగారి ఆగడాలు

- బినామీ పేర్లతో భూములు స్వాహా చేసిన విజిలెన్స్ అధికారి
- పైగా వడ్డీ వ్యాపారం, అక్రమంగా గ్రావెల్ తరలింపు
- తల్లి సర్పంచి కావడంతో రాజకీయ పెత్తనం



పొదలకూరు/నెల్లూరు, జూలై 7: నిజాయితీ.. నిబద్ధత.. క్రమశిక్షణతో పనిచేయాల్సిన నాలుగో సింహం ఒకటి దారి తప్పింది. తన నడవడికతో గ్రామస్థులకు ఆదర్శంగా ఉండాల్సిన ఆ విజిలెన్స్ అధికారి చేయకూడని పనులన్నీ చేస్తున్నాడు. రెండు దశాబ్దాలుగా గ్రామరాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఇప్పటికీ తన తల్లిని సర్పంచుగా ఉంచి, గ్రామంలో పెత్తనం చలాయిస్తున్నాడు. గ్రామంలో ఓ పదిమందిని తన కోటరీగా మార్చుకుని బినామీ పేర్లతో సుమారు 90 ఎకరాలకు పైగా ఆక్రమించుకున్నాడు. అంతేకాక గ్రామంలో వడ్డీ వ్యాపారం చేస్తూ సకాలంలో నగదు చెల్లించని వారిని తన అధికారం బలంతో ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. పొదలకూరు మండలం అల్తుర్తి గ్రామంలో ఆయన మాటే శాసనంగా అమలు జరగాలి. కాదని ఎదురుతిరిగితే అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అల్తుర్తి సమీపంలోని కొండ నుంచి అక్రమంగా గ్రావెల్ తరలించి, రూ.లక్షలు దోచుకున్నాడు. ఇంకా పలు అభియోగాలు కూడా ఆయనపై ఉన్నాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూడా టీడీపీ నాయకులను, కార్యకర్తలను బెదిరింపులకు గురి చేశాడు. ఈ క్రమంలో మాజీ మంత్రి సోమిరెడ్డి ఆయనపై ఆగ్రహిస్తూ... ప్రజాధనాన్ని జీతంగా తీసుకునే ఉద్యోగి, ఉద్యోగిగానే వ్యవహరించాలని, రాజకీయాల్లో జోక్యం తగదని బహిరంగంగా హెచ్చరించారు. తాజాగా ఆయనగారి ప్రధాన అనుచరుడైన అంకయ్య అనే వ్యక్తిపై పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. దీంతో ఆయన పోలీసులకు ఫోన్ చేసి అంకయ్యపై కేసు నమోదు చేయవద్దని, ఒకవేళ నమోదు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించినట్లు తెలిసింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి,గ్రామంలో విచారణ జరిపితే వాస్తవాలు వెలుగుచూస్తాయి.

నేటి నుంచే ఉచిత ఇసుక

- మూడు యార్డుల్లో విక్రయాలకు గ్రీన్‌సిగ్నల్
- టన్ను ధర రూ.370గా ఖరారు
- డిజిటల్ పేమెంట్‌తో సొంతంగా రవాణాకు అవకాశం
- భవన నిర్మాణదారులకు ఎంతో ఊరట


మినగల్లులోని ఇసుక స్టాక్ యార్డు

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)/నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూలై 7: వైసీపీ ప్రభుత్వ హయాంలో బంగారంలా మారిన ఇసుకను ప్రజలకు ఉచితంగా అందించాలని ఎన్డీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికల్లో టీడీపీ కూటమి ఇచ్చిన హామీని నెరవేరుస్తూ సోమవారం నుంచి ఇసుకను ఉచితంగా ఇవ్వనున్నారు. జిల్లాలో తొలివిడతగా స్టాక్ యార్డుల్లో ఉన్న ఇసుకను ప్రజలకు అందించనున్నారు. రీచ్‌ల్లో తవ్వకాలకు పర్యావరణ అనుమతులు లేకపోవడంతో ప్రస్తుతానికి అక్కడ తవ్వకాలు జరగడంలేదు. పర్యావరణ అనుమతులు రాగానే రీచ్‌ల్లో కూడా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయనున్నారు.

అందుబాటులో 1.74 టన్నుల ఇసుక

ప్రస్తుతానికి జిల్లాలోని మర్రిపాడు,మినగల్లు,పల్లిపాడు స్టాక్‌యార్డుల్లో 1.74 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. మర్రిపాడులో 1.25లక్షల టన్నులు, మినగల్లులో 41వేల టన్నులు,పల్లిపాడులో 8వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. ఈ యార్డుల్లో ఉచిత ఇసుక విధానం ద్వారా టన్ను ధర రూ.370గా నిర్ణయించారు. రీచ్ నుంచి యార్డుకు తీసుకొచ్చిన రవాణా చార్జీలు, యార్డు ల్లో లోడింగ్ చార్జీలు, నిర్వహణ చార్జీలు, సీనరైజ్ చార్జీలు మొత్తం కలిపి రూ.370గా ఖరారు చేశారు. ఇందులో ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఆదాయం తీసుకోవడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో ఇదే యార్డుల వద్ద టన్ను ఇసుక ధర సుమారుగా రూ. 800గా ఉండేది. ఈ లెక్కన చూసుకొంటే ఇసుక ధర సగానికిపైగా తగ్గినట్లే. ఇప్పటి వరకు ట్రాక్టర్ ఇసుక ధర రూ.5వేలు ఉండగా, ఇప్పుడు అది రూ.2వేలు నుంచి రూ.2,500 పలకనుంది. దీంతో భవన నిర్మాణదారులకు భారీ ఊరట కలుగనున్నది. పేద, మధ్యతరగతి వర్గాలకు కూడా ఎంతో లబ్ధి చేకూరనున్నది. జిల్లాలో ఉచిత ఇసుక విధానంపై కలెక్టర్ ఓ. ఆనంద్ అధ్యక్షతన ఆదివారం జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. విధివిధానాలపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.


ఉచిత ఇసుక విధానంపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఆనంద్(ఫైల్)

నేడు మినగల్లు రీచ్‌ను ప్రారంభించనున్న ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు సోమవారం నుంచి ఉచిత ఇసుకను అందించనున్నారు. ఈ క్రమంలో మండలంలోని మినగల్ ఇసుక రీచ్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

నూతన విధివిధానాలు

- జిల్లాలోని స్టాక్ యార్డుల ద్వారా ఇసుక సరఫరా చేస్తారు.
- కూలీలు, రవాణా ఖర్చులు కలిపి టన్ను ఇసుకను రూ.370గా నిర్ణయించారు.
- యార్డుల వద్ద కేవలం ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం,క్యూఆర్‌కోడ్ ద్వారానే కొనుగోలు చేయాలి.
- ఎవరు ముందువస్తే వారికే ముందుగా ఇసుకను అందిస్తారు.
- ఓ వ్యక్తికి రోజుకు 20 టన్నులు మాత్రమే విక్రయిస్తారు.
- స్టాక్ యార్డు నుంచి ఇసుకను కొనుగోలు చేసిన వినియోగదారుడికి మైనింగ్‌శాఖ రసీదు అందిస్తారు.
- ప్రతీ స్టాక్ యార్డు వద్ద నూతన ఉచిత పాలసీ బ్యానర్‌ను ఏర్పాటు చేస్తారు.
- గ్రామాల్లోని వాగులు,వంకల్లో లభ్యమయ్యే ఇసుకను స్థానికులు ఎడ్లబండ్ల ద్వారా తీసుకుపోవచ్చు.
- ఇసుక సరఫరాలో ఎలాంటి అక్రమాలు జరిగినా 1800-425-6034 (టోల్‌ఫ్రీ),0861- 2943569 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.
- ఇసుక విధానంపై ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరించేందుకు జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో మైనింగ్, సెబ్, పంచాయితీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు ఉంటారు.

సర్పంచులే మళ్లీ రారాజులు ?

- పంచాయతీలకు పూర్వవైభవం
- విస్తృతంగా ప్రభుత్వం చర్చలు
- 2019లో వైసీపీ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు
- నిర్వీర్యమైన పంచాయతీరాజ్ వ్యవస్థ
- రెండింటినీ అనుసంధానం చేసే దిశగా పాలకుల అడుగులు


వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన సంగం-1 సచివాలయం

సంగం, జూలై 7: గ్రామ పంచాయతీ వ్యవస్థకు పూర్వవైభవం తెచ్చేందుకు కొత్తగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం యోచిస్తున్నది. ఆ దిశగా చర్చలు జరుపుతోంది. సచివాలయా లను, గ్రామ పంచా యతీలతో అనుసంధానం చేసేలా పాలకులు అడు గులు వేస్తున్నట్లు సమాచారం. 2019లో వైసీపీ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి, పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీంతో పంచాయతీ పాలక వర్గాలు ఉన్నా అవి ఉత్సవ విగ్రహాల్లా మారాయి. ప్రజలకు ఏ అవసరం వచ్చినా గ్రామ పంచాయతీలకు కాకుండా, సచివాలయాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సచివాలయ వ్యవస్థ నిర్వహణ బాధ్యత మాత్రం పంచాయతీలకు ఉన్నా, అందులో పనిచేసే ఉద్యోగులు పంచాయతీ పాల కుల అజమాయిషీలో లేకుండా పోయారు. దీంతో గత మూడేళ్ల నుంచి గ్రామ పంచాయతీల పాలకులు తమకు హక్కులు కల్పించాలని పలుమార్లు వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పాలకులు పట్టించుకోలేదు. దీంతో అటు సర్పంచులు కానీ, ఇటు పంచాయతీ కార్యదర్శులుకానీ ఏమి చేయలేకపోయారు.

విస్తృతంగా చర్చలు

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పంచాయతీరాజ్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు, పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యంపై అధికారులతో సమీక్షించారు. గ్రామ పంచాయతీల స్థానంలో సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో అవి నిర్వీర్యమైనట్లు గుర్తించారు. ఈ విధానాన్ని మార్పుచేసేలాయత్నిస్తున్నారు.

పంచాయతీలకు గత వైభవం

జిల్లాలో 722 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 769 సచివాలయాలు ఉన్నాయి. కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో మరో 203 సచివాలయాలు ఉన్నాయి. సచివాలయ వ్యవస్థలోని ఉద్యోగులు వైసీపీ ప్రభుత్వం ఏది చెబితే అదే చేయాల్సిన పరిస్థితి. ఆ సచివాలయాల పరిధిలోనే ప్రభుత్వ కార్యక్రమాలు జరుగుతున్న విషయాన్ని గుర్తించిన ఎన్డీఏ ప్రభుత్వం, అందులో పంచాయతీ వ్యవస్థకు పూర్వవైభవం తెచ్చే దిశగా అడుగులు వేస్తుంది.

పంచాయతీల పరిధిలో సచివాలయ ఉద్యోగులు ?

సచివాలయ వ్యవస్థలోని ఉద్యోగులను పంచాయతీల పరిధిలో భాగస్వామ్యం చేసే దిశగా కొత్త ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఈ ప్రక్రియ రెండు వారాల్లో పూర్తవుతుందనే ప్రచారం సాగుతోంది. ఇకపోతే గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో గ్రామాల్లో మీసేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలకు అన్నీ రకాల సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఆ సేవలను కూడా మళ్లీ పునరుద్ధరించే అవకాశం ఉన్నట్లు తెలియవచ్చింది.ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా గ్రామాల అభివృద్ధితోపాటు ప్రజలకు సత్వర సేవలు అందుబాటులోకి తెచ్చేలా పాలకులు అడుగులు వేస్తున్నారు.

అమాంతం పెరిగిన బ్యారన్ల లీజు

- రాళ్లపాడులో వేలంపెట్టిన యజమానులు
- రూ.2,70లక్షలు పలికిన రేటు
- లైసెన్సులకు రూ.7 నుంచి రూ.8 లక్షల వరకు ఖర్చు
- పొగాకుకు మద్దతు ధర పెరగడమే కారణం


లింగసముద్రంలోని పొగాకు బ్యారన్‌లు

లింగసముద్రం, జూలై 7 : గత ఏడాది నుంచి పొగాకు మద్దతు ధర అమాంతంగా పెరిగింది. దీంతో బ్యారన్ల లీజుకు, లైసెన్సుల కొనుగోలుకు భారీగా డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా బ్యారన్ల యజమానులు లీజు వేలంపాటలు నిర్వహిస్తున్నారు. బ్యారన్ లీజు రూ.2.70 వరకు పలికింది. గతంలో బ్యారన్ లీసు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు ఉండేది. అలాగే లైసెన్సుకు రూ.7 నుంచి రూ.8 లక్షల వరకు ఖర్చు అవుతున్నది.

మద్దతు ధర పెరగడమే కారణం

ఈ ఏడాది మొదటి గ్రేడు క్వింటా పొగాకు ధర మొదట్లో రూ.23 వేలు, లోగ్రేడు రూ.21 వేలు పలికింది. ప్రస్తుతం మొదటి గ్రేడు క్వింటా పొగాకు రూ.36 వేలు పలికింది.గత ఏడాది మొదటి గ్రేడు క్వింటా పొగాకు రూ.27 వేలు, లో గ్రేడ్ రూ.18 వేలు నుంచి రూ.20 వేలు పలికింది. తాజాగా పొగాకు ధరలు అమాంతం పెరగడంతో బ్యారన్ల లీజులకు, లైసెన్స్‌ల కోసం రైతులు పరుగులు తీస్తున్నారు. ఇటీవల మండలంలోని రాళ్లపాడులో బ్యారన్ల లీజు కోసం రైతులు వేలంపాటలు నిర్వహించారు.ఈ వేలంలో ఓ రైతు బ్యారన్ లీజును రూ.2.70 లక్షలకు దక్కించుకున్నారు. అయితే బ్యారన్‌ను లీజుకు అగ్రిమెంట్ తీసుకున్న రైతు ఆ వివరాలను పొగాకు బోర్డులో తెలియజేయాలని అధికారులు తెలిపారు.

లైసెన్సుకు రూ.లక్షల వ్యయం

ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో బ్యారన్లను ఉపయోగించని రైతుల నుంచి ఆ బ్యారన్ లైసెన్స్ కోసం మండలంలోని కొందరు రైతులు గాలిస్తున్నారు. అయితే అలాంటి రైతులు బ్యారన్ లైసెన్స్‌ను రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షలు చెబుతున్నట్లు మండలంలోని తిమ్మారెడ్డిపాలెం, లింగసముద్రం తదితర గ్రామాలకు చెందిన రైతులు చెబుతున్నారు.అయితే అంత మొత్తం చెల్లించినా బ్యారన్ల లైసెన్స్‌లు దొరకడం లేదని వారంటున్నారు. ఇకపోతే కూలీల రేట్లు కూడా విపరీతంగా పెరిగాయి.

మత్తులో తూలుతున్న బుచ్చి

● జోరుగా మాదకద్రవ్యాల వ్యాపారం ● ఆకర్షితులవుతున్న మైనర్లు, యువకులు

● భయంగుప్పిట్లో బాలికలు, మహిళలు



మత్తుకోసం వార్నిష్ పీలుస్తున్న యువకుడు

బుచ్చిరెడ్డిపాళెం,జూలై 7 : బుచ్చి నగర పంచాయతీతోపాటు పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వ్యాపారం జోరుగా సాగుతోంది. మత్తు పదార్థాల బారిన ఎక్కువగా మైనర్లు,యువకులు పడుతున్నారు. ఆ మత్తులో వారు ఏంచేస్తున్నారో వారికే తెలియదు. వీరి ఆగడాల ధాటికి బాలికలు, యువతులు, మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో బుచ్చిలో గంజాయి, సారా, స్పిరిట్, మత్తుమాత్రలు, వార్నిష్ ఇతర డ్రగ్స్ వ్యాపారాలు జోరుగా సాగాయి. కొంతకాలం క్రితం బుచ్చిలో కొకైన్ కూడా అందుబాటులో ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. అయినా సంబంధిత అధికారులెవరూ చర్యలు చేపట్టలేదు. ఈ క్రమంలో మత్తుకు బానిసైన ఓ యువకుడు రెండు రోజుల క్రితం చేతి నరాలకు ఇంజక్షన్‌ద్వారా డ్రగ్ ఎక్కించుకునే క్రమంలో ఆ సమాచారం తల్లిదండ్రులకు తెలిసింది. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.

● **ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు**

తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఆ యువకుడితోపాటు మరో 15 మంది యువకులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీఐ హైమారావు తెలిపారు. కాగా బుచ్చిలో 200నుంచి 300 మందికిపైగా మైనర్లు, యువకులు మాదకద్రవ్యాలకు బానిసలు అయినట్లు ప్రచారం సాగు తోంది. మత్తు పదార్థాల ఊబిలో కూరుకుపోయిన యువకులు, మైనర్లంతా కూడా పేదింటి వారే. ఇప్పటికైనా పోలీసులు మత్తు పదార్థాల వ్యాపారాన్ని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), జూలై 7: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని వేదాయపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగింది. మృతుడు తెలుపు రంగు గళ్ల ఆఫ్ హ్యాండ్ షర్ట్, తెలుపురంగు పంచ ధరించి ఉన్నాడు. మృతుడు ఒంటిపై జంధ్యం ఉంది. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ జీ మాలకొండయ్య సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మితిమీరిన వేగమే ప్రాణం తీసింది

● ఉపాధి కోసం వెళుతూ..తిరిగిరాని లోకాలకు..

● స్కూటీని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

● లారీలు ఆగడం వల్లే ప్రమాదం

బస్సు చక్రాల కింద పడిఉన్న సురేష్‌రెడ్డి మృతదేహం



మనుబోలు, జూలై 7: కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలోని జాతీయరహదారిపై ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మనుబోలు సురేష్‌రెడ్డి (45) దుర్మరణం చెందగా, మరికరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని బాలాజీ నగర్‌కు చెందిన సురేష్‌రెడ్డి నారాయణ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసేవాడు. అక్కడ ఉద్యోగం పోవడంతో కృష్ణపట్నం పోర్టులో సెక్యూరిటీ పోస్టులు ఉన్నాయని తెలుసుకున్నాడు. పరిచయస్తుడైన పర్వతాల ప్రశాంత్‌తో కలిసి స్కూటీలో పోర్టు వద్దకు బయలుదేరారు. కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో రోడ్డుకు ఎడమపక్క భారీ లారీలు ఆగి ఉన్నాయి. కుడిపక్కన లారీ వెళుతుండగా రెండోమార్గంలో సురేష్‌రెడ్డి స్కూటీ వెళుతోంది. అదేమార్గంలో బెంగళూరు నుంచి కందుకూరుకు వెళ్లాల్సిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు మితిమీరిన వేగంతో వచ్చి స్కూటీని ఢీకొనడంతో స్కూటీ నడుపుతున్న సురేష్‌రెడ్డి రోడ్డుపై పడి బస్సుచక్రాల కింద నలిగిపోయాడు. ప్రమాదం జరగ్గానే బస్సు ఇంజన్ ఆపకుండానే ఇద్దరు డ్రైవర్లు పరారయ్యారు. దీంతో బస్సులో ఉన్న 16మంది ప్రయాణికులు బస్సు దిగి కావలి, నెల్లూరు, కందుకూరుకు ఇతర వాహనాల్లో వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ. అజయ్‌కుమార్ ప్రమాదస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహంను శవపరీక్షల నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు పక్కన లారీల వల్లే ప్రమాదాలు

ఓ పక్క పోలీసులు, హైవే సిబ్బంది, రోడ్డు సేఫ్టీ అధికారులు లారీలు ఎక్కడంటే అక్కడ నిలపవద్దని, పార్కింగ్ ప్రదేశాల్లో ఆగాలని చెపుతున్నా లారీ డ్రైవర్లు పెడచెవిన పెడుతున్నారు. ఇవాళ జరిగిన ప్రమాదానికి లారీలు నిలపడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. కొండూరు సత్రంనుంచి గురివిందపూడి వరకు ఇరుకువంతెనలు, రోడ్డు విస్తరణ తక్కువగా ఉంటుంది. మార్జిన్‌లో లారీలు నిలపడంతో ఆ స్థలంలో వెళ్లాల్సిన మోటార్‌సైకిళ్లు, ఇతర చిన్న వాహనాలన్నీ ప్రధానరోడ్డుపై వెళ్లాల్సివస్తోంది. ఆ సమయంలో వేగంగా వచ్చేభారీ వాహనాల నుంచి తప్పించుకునేందుకు వీలు ఉండదు. ప్రమాదం జరిగిన చోట రెండు భారీ లారీలు నిలిచి ఉండడంతో స్కూటీని తప్పించే పరిస్థితి లేక ఇలా జరిగిందని అవగతమవుతోంది. ఈ ప్రమాదంతో సుమారు అరగంట పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. స్కూటీ బస్సు కింద ఇరుక్కుపోవడంతో దానిని తీసేందుకు పోలీసులు, హైవే సిబ్బంది శ్రమించారు. ప్రమాదానికి కారణమైన బస్సును స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వెంకటాచలంలో చోరీ

● వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు



చోరీ జరిగిన మొబైల్స్ దుకాణం

వెంకటాచలం, జూలై 7: స్థానిక సర్వేపల్లి జాతీయ రహదారి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న రెండు దుకాణాల్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. రవి కూల్‌డ్రింక్స్ షాప్‌తో పాటు మమ్ము మొబైల్ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలకొట్టి లోనికి ప్రవేశించారు. రవి కూల్‌డ్రింక్స్‌లో రూ.50 వేలు విలువచేసే సిగరెట్లు, నగదు, ఇతర వస్తువులు, పక్కనే ఉన్న మమ్ము మొబైల్స్‌లో రూ.80వేలు విలువ చేసే సెల్‌ఫోన్లు, నగదు తీసుకెళ్లారు. మొబైల్స్ దుకాణ నిర్వాహకుడు ఖలీల్ చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా వెంకటాచలం, కాకుటూరు, కసుపూరు, ఎర్రగుంట, కసుమూరు గ్రామాల్లో ఆరునెలలుగా వరుస చోరీలు జరుగుతున్నాయని గ్రామాల ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. మొన్న కాకుటూరు జైన్ ఆలయం, నేడు వెంకటాచలంలో చోరీలు జరిగాయి. అయితే రాత్రులు పోలీసులు సక్రమంగా గస్తీ చేయకుండా రహదారిపై మామూళ్లు దండుకోవడమే పనిగా పెట్టుకున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నారు.

మాయమాటలు చెప్పి.. మనీ లాక్కెల్లాడు !

ఉదయగిరి రూరల్, జూలై 7: ఓ పెద్దాయన రోడ్డుపై డబ్బులు పడి ఉన్నాయ్ నీవేనా.. అన్నాడు ఓ వ్యక్తి. ఆ పెద్దాయనా అవి నావి కాదయ్యా అన్నాడు. అయినా ఓసారి జేబు చూసుకో అన్నాడు. వెంటనే ఆ పెద్దాయన జేబులో ఉన్న డబ్బులు చేతికి తీసుకొని ఇవిగో నా డబ్బులు అంటుండగానే ఓ వ్యక్తి నగదును లాక్కొని పరారైన సంఘటన ఆదివారం దాసరిపల్లి-ఉదయగిరి గ్రామాల మధ్య ఉన్న 167బీజీ జాతీయ రహదారిపై చోటుచేసు కొంది. వివరాలు ఇలా ఉన్నాయి. దాసరిపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడైన సయ్యద్ అమీరుల్లా గ్రామంలో బడ్డీ కొట్టు నిర్వహిస్తుంటాడు. సరుకుల కోసమని మూడు చక్రాల వాహనంపై ఉదయగిరికి బయలుదేరాడు. ఈ సమయంలో వెనుక మోటార్ బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తి రోడ్డుపై ఆయనకు మామ మాటలు చెప్పి చేతిలో ఉన్న రూ.8 వేలు తీసుకుని పరారయ్యాడు. ఈ విషయంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి నిందితుడి కోసం చర్చి, పెట్రోల్‌బంకుల వద్ద గల సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	137
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	274
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6989
వెండి కిలో ధర	రూ. 94,900
వెండి ఒక గ్రాము	రూ. 96.90

అంతరిస్తున్న మడ అడవులు

● అదృశ్యమవుతున్న గ్రీన్‌వాల్ ● ముందుకొస్తున్న సముద్రం ● భవిష్యత్తులో పొంచి ఉన్న పెనుప్రమాదం



అంతరించిపోతున్న మడ అడవులు



ఉప్పు కయ్యలుగా మారిన మడ అడవుల ప్రాంతం

అల్లూరు, జూలై 7 : సముద్రానికి భూతలానికి మధ్యలో సముద్ర తీరం వెంబడి దట్టంగా పెరిగే చెట్లనే మడ అడవులు అంటారు. కారణాలు ఏవైనా ఇవి రోజురోజుకీ కనుమరుగవుతున్నాయి. సముద్రంలో అలలు ఉధృతంగా ఉన్నప్పుడు తీరం కోతకు గురవకుండా రక్షించే కవచంలా మడ అడవులు ఉపయోగపడతాయి. అలాంటి ఈ మడ అడవులు ప్రస్తుతం చూడాలనుకున్నా కనిపించే పరిస్థితి లేదు. కారణం వాటిని పూర్తిస్థాయిలో తొలగించడమే. దీంతో భవిష్యత్తులో మానవాళి తీవ్ర ప్రమాదం ఎదుర్కోబోతున్నామన్నది వాస్తవం. జిల్లాలో 178 కిలోమీటర్ల సముద్ర తీరం విస్తరించి ఉంది. సముద్ర తీరం పొడవునా పొదల్లాంటి చెట్లు దట్టంగా పెరిగి భూతలానికి రక్షణ గోడగా ఉంటాయి. జనభా సంఖ్య పెరిగే కొద్ది భూమిపై ఉండే చెట్లు, పక్షులు, వన్యప్రాణులు అంతచించిపోతున్నాయి.

● **బలహీనపడుతున్న తీరం**

తీరంలో దట్టంగా విస్తరించి ఉండే మడ అడవులను నరికేసి ఆ భూమిని ఉప్పు కయ్యలుగానో, రొయ్యల గుంటలగానో మార్చేస్తున్నారు. మానవుడి అవసరానుగుణంగా ఎటువంటి చర్యలకైనా వెనకాడడం లేదు. చేసే పని భావితరాలకు నష్టాన్ని చేకూర్చేది అయినా దాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో మడ అడవులు పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉన్నా లెక్కచేయని పరిస్థితి.

● **కానరాని గ్రీన్‌వాల్**

సముద్రం తీరం వెంబడి చెట్ల సంఖ్యను అత్యధికంగా పెంచడమే గ్రీన్‌వాల్ ఉద్దేశ్యం. అయితే సముద్రం పక్కల చెట్లు కాకుండా ఇతరత్రా ఆక్రమణలు కొనసాగుతున్నాయి. దీంతో సముద్ర తీరప్రాంతంలో గ్రీన్‌వాల్‌కు అవకాశం లేకుండా పోతోంది. ఇప్పటికే ఆక్వా సాగు జిల్లాలో అత్యధికంగా ఉండడంతో బకింగ్ హామ్ కెనాల్‌కు అటూఇటూ రొయ్యల గుంటలు దర్శనమిస్తున్నాయి. మడ అడవులు నశిస్తున్నాయని వాటికి బదులుగా తీరప్రాంతంలో చెట్ల పెంపకాన్ని చేపట్టాలని కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. రెండేళ్ల కిందట కొన్ని కోట్ల తాటిచెట్లను పెంచాలనే ఉద్దేశంతో తాటి ముట్టెలను సేకరించి తీరప్రాంతాల్లో నాటేందుకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం కేవలం ప్రకటనలకే తప్ప పూర్తిస్థాయిలో చేపట్టలేకపోయారు.

● **రూపుమారుతున్న మడ అడవులు**

గత 30 ఏళ్ల క్రితం దట్టంగా విస్తరించి ఉండే మడ అడవులు ఇప్పుడు కనుమరుగయ్యాయి. మడ అడవుల ప్రాంతంలో రొయ్యల చెరువులు, ఉప్పు కయ్యలు దర్శనమిస్తున్నాయి. యథేచ్ఛగా మడ అడవులను నరికివేసి ఆ ప్రాంతంలో కొంతమంది రొయ్యల చెరువులను, ఉప్పు కయ్యలుగా ఏర్పాటు చేసేస్తున్నారు.ఇలానే వదిలేస్తే రానున్న తరం విద్యార్థులకు తీరప్రాంతంలో మడ అడవులు ఉండేవి అని పాఠాల్లో చెప్పుకోవాల్సిందే.

● **ఏటా కోతకు గురవుతున్న తీరం**

ప్రతీఏటా వర్షాల సమయంలో సముద్రంలో ఏర్పడే తుఫానుల కారణంగా తీరం కోతకు గురవుతూనే ఉంది. దీంతో ఆ ప్రాంతంలో ఉండే కొన్ని పట్టా భూములనుసైతం సముద్రం కబ్జా చేస్తున్నది. దీనిని ఎదుర్కొనే శక్తి మానవుడికి లేనప్పటికీ ముందు జాగ్రత్త కూడా పాటించక పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది.

తీరప్రాంతానికి ముప్పు



తీరప్రాంతంలో సముద్ర విపత్తుల నుంచి జీవజాలాన్ని కాపాడేది మడ అడవులే. అవి అంతరించడంతో తీరప్రాంతానికి ముప్పు పొంచి ఉంది. దీన్ని నిలువరించాలంటే తీరప్రాంతంలో దట్టంగా సవక, జామాయిల్, తాటి తదితర చెట్ల పెంపకాన్ని చేపట్టాలి.

- కొప్పు శ్రీనివాసులు, విశ్రాంత ఉపాధ్యాయుడు, అల్లూరు

పర్యావరణాన్ని రక్షించే బాధ్యత అందరిదీ..



ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మానవుడిదే. ఈ విషయాన్ని విస్మరించి ప్రతీ ఒక్కరూ స్వార్థంతో చెట్లను నరికేస్తూ పర్యావరణ వినాశనానికి కారణమవుతున్నారు. దీన్ని నిలువరించేందుకు ఉద్యమంలా కదలాలి.

- ఆలూరు వెంకటసుకుమార్‌రెడ్డి, అల్లూరు



ఎడ్ల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి

చౌదరిపాలెంలో జిల్లాస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

● ప్రారంభించిన ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, జూలై 7: కోదండరామస్వామి ఉత్సవాలలో భాగంగా కావలి మండలం చౌదరిపాలెంలో సేద్యపు ఎడ్ల బండలాగుడు పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈపోటీలకు జిల్లాలోని విధ ప్రాంతాల నుంచి 15 జతల ఎడ్లతో రైతులు పాల్గొన్నారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంప్రదాయమైన ఎడ్ల బండలాగుడు పోటీలను చౌదరిపాలెం వాసులు ప్రారంభించి అంతరించిపోతున్న సేద్యపు ఎడ్లను ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. గోమాతల విశిష్టతను ఈ సందర్భంగా ఆయన వివరించారు. పోటీలు అనంతరం సాయంత్రం విజేతలకు బహుమతులను అందచేశారు. ప్రధమ బహుమతిని జొన్నవాడకు చెందిన అంకయ్య ఎడ్లు గెలుచుకోగా ఆయనకు క్రిష్ణా ఫ్యాన్స్‌కు చెందిన కోడెల క్రిష్ణ సహకారంతో రూ.15 వేల నగదు బహుమతిని అందచేశారు. శ్రీలక్ష్మీవెంకటేశ్వర ట్రాక్టర్స్, మునునూరు సహకారంతో ద్వితీయ బహుమతి కింద తూర్పుగోగుల పల్లికి చెందిన జితేంద్రరెడ్డికి రూ.12 వేలు నగదు అందచేశారు. శింగమనేని సీతారామయ్య మునునూరు సహకారంతో తృతీయ బహుమతి కింద రూ.10వేల నగదును ఎల్లయ్యకు అందచేశారు. మారెళ్ల భాస్కరరావు చౌదరిపాలెం సహకారంతో నాల్గవ బహుమతి కింద రూ.8 వేల నగదును దువ్వూరు శైలజరెడ్డికి అందచేశారు. కోదండరామస్వామి దేవస్థానం చౌదరిపాలెం ద్వారా ఐదవ బహుమతి కింద రూ. 5 వేలు నగదును పల్లెబోయిన క్రిష్ణతేజరెడ్డికి అందచేశారు. చౌదరిపాలెంకు చెందిన గోరంట్ల రాంబాబు, గొంది విష్ణు, బాలంరెడ్డి కుమార్‌స్వామి, డీ వెంగళరావుల పర్యవేక్షణలో పోటీలు జరిగాయి.



ప్రథమ బహుమతి విజేతకు నగదు అందచేస్తున్న కోడెల క్రిష్ణ

రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు (వైద్యం), జూలై 7 : రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక హోదా తీసుకురావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జక్కా వెంకయ్య భవన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ప్రత్యేక హోదా తీసుకు రాలేక పోయిందని దుయ్యబట్టారు. అయితే ఈ ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు పెద్దపీట వేసిన నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉన్న బీహారు ముఖ్యమంత్రి నితిష్ ఆ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేస్తున్నారని, ఎక్కువ ఎంపీ సీట్లు ఉన్న చంద్రబాబు ప్రత్యేక హోదా విషయంలో గట్టిగా నిలబడాల న్నారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో బీజేపీ బలపడేందుకు టీడీపీ, జనసేనతో కలిసి రాష్ట్రంలో పోటీ చేసి ఎంపీ, ఎమ్మెల్యేల సీట్లు గెలిచారన్నారు. రాష్ట్రంలో మత విద్వేషాలు సృష్టించేందుకు కుయుక్తులు పన్నుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో సింహపురి ముద్దుబిడ్డగా ఉద్యమాల ఊపిరిగా ప్రజా ఉద్యమాలను కడవరకు చేపట్టిన నేత జక్కా వెంకయ్య అన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన వ్యక్తి ఆయనేనని తెలిపారు. ఈ ఉద్యమాల ద్వారా ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మాజీ డిప్యూటీ మేయర్ వెంకటేశ్వర్లు, సీపీఎం నేత కట్టా సతీష్ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల సేవలో విద్యుత్ అధికారులు

● సొంత లాభం కోసం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వైనం

● టీడీపీ నాయకులు ప్రశ్నించడంతో వెనుతిరిగిన సిబ్బంది

పొదలకూరు, జూలై 7: వైసీపీ నాయకుల సేవలో పొదలకూరు విద్యుత్ అధికారులు ఇంకా తరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పొదలకూరు ప్రధాన రహదారిని అనుకుని ఉన్న రైస్ మిల్లు వద్ద, కెనరా బ్యాంకు ఎదురుగా ఉన్న ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు వైసీపీ నాయకుడి దుకాణాలకు అడ్డుగా ఉన్నాయని, డాన్ బాస్కో స్కూల్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మరో వైసీపీ నాయకుడికి ఇంటి సమీపంలో ఉందని వారు కోరడంతో వాటిని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. వాలిన స్తంభాలను సరిచేయాలని, విద్యుత్‌లైన్ల మరమ్మతులు చేపట్టాలని సూచించినా పట్టించుకోని కరెంట్ అధికారులు వైసీపీ నాయకులు ఇచ్చే అమ్యామ్యాలకు దాసోహం అయ్యారని అందుకే నిబంధలను తుంగలో తొక్కారని టీడీపీ నాయకులు ఆదివారం విలేకరుల ఎదుట వాపోయారు. సెలవు దినం కావడంతో నిబంధనలకు విరుద్ధంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని టీడీపీ నాయకులు బోగోలు భాస్కర్‌రెడ్డి, బ్రహ్మదేవి చంద్రశేఖర్, సుధీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులను వారు చేస్తున్న పనిని నిలదీయడంతో చేసేదేమీలేక చేస్తున్న తప్పును కప్పిపుచ్చుకోలేక విద్యుత్ సిబ్బంది వెనుదిరిగారు.

ఇద్దరు యువకులపై కేసు

సంగం, జూలై 7: మండలంలోని కొరిమెర్లలో పి శ్రీనివాసులు, రోహిత్ అనే ఇద్దరు యువకులపై ఆదివారం సంగం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల గ్రామం లో ఓ కుటుంబ కలహాల విషయంలో వీరిద్దరిని సంగం పోలీసులు స్టేషన్‌కు పిలిపించి మందలించారు. ఇందుకు కారణం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అనిల్ కుమార్‌రెడ్డి అని భావించి అతనిపై ఆదివారం గ్రామంలోని టీ దుకాణం వద్ద అటకాయించి దాడి చేయబోయారు. ఆమేరకు బాధితుడి నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసులు విచారించి శ్రీనివాసులు, రోహిత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

మోటార్‌బైక్ చోరీపై కేసు నమోదు

ఉదయగిరి రూరల్, జూలై 7: అన్నంపల్లిలో మోటార్‌బైక్ చోరీ ఘనటపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన నల్లు అంజయ్య బజాజ్ డిస్కవరీ మోటార్ బైక్ ఇంటి వద్ద నిలిపి ఉండగా ఈ నెల 3వ తేదీ రాత్రి కాకర్ల మాల్యాద్రి అనే వ్యక్తి చోరీ చేశారని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. చోరీకి గురైన మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితున్ని అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం.

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 7: మండల కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ గోడౌన్ సమీపంలోని 565జాతీయ రహదారిపై ఆదివారం గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. అనంతపురం నుంచి కనిగిరికి వెళుతున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.



బోల్తాపడ్డ గ్యాస్ సిలిండర్ల లారీ

అలిపిరి వద్ద యువకుడి ఆత్మహత్య

చేజర్ల, జూలై 7: మండలంలోని పడమటికండ్రిక గ్రామానికి చెందిన ఎం.భార్గవ్ అనే వ్యక్తి తిరుపతిలోని అలిపిరి సమీపంలోని ఆత్మహత్య చేసుకున్నట్లు అలిపిరి పోలీసులు చేజర్ల పోలీసులకు ఆదివారం సాయంత్రం సమాచారం ఇచ్చారు. పోలీసుల కథనం మేరకు, ఆదివారం సాయంత్రం అలిపిరి సమీపంలోని అటవీ ప్రాంతంలో సుమారు 30 ఏళ్ల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి చెట్టు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం రాగా సంఘటనా స్థలానికి చేరుకున్న అలిపిరి పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అయితే సంఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతుడుకి చొక్కాకు ఉన్న లేబుల్ ఆధారంగా చేజర్ల పోలీసుల ద్వారా ఆదురుపల్లికి చెందిన టైలర్‌ను సంప్రదించగా చేజర్ల మండలం పడమటికండ్రిక గ్రామానికి చెందిన ఎమ్.భార్గవ్‌గా గుర్తించారు. మృతుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు అలిపిరి పోలీసులు తెలిపారు.

డీటీలకు అడహక్ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించాలి

● ఏపీఆర్ఎస్ఏ కార్యవర్గ సమావేశంలో తీర్మానం

నెల్లూరు(హరనాథపురం), జూలై 7 : డిప్యూటీ తహసీల్దార్లకు సీనియారిటీ ప్రకారం అడహక్ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. ఈ మేరకు కొత్తగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ఆనంద్‌ను కోరాలని నిర్ణయించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని ఏపీఆర్ఎస్ఏ భవన్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. దివంగత ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌ప్రసాద్ వర్ధంతిని సెప్టెంబరు 27వ తేదీన నెల్లూరులో నిర్వహించాలని తీర్మానించారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించిన కలెక్టర్ ఎం.హరినారాయణన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, జిల్లా కార్యదర్శి డానియల్ పీటర్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడు బి.మురళి, కోశాధికారి సతీష్, స్వప్న, బాలకోటమ్మ, శేషయ్య, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో వర్షం

● విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(హరనాథపురం): జిల్లాలో ఆదివారం సాయంత్రం గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఇటీవల వరకు ఎండ వేడితో ఇబ్బందులు పడ్డ ప్రజలకు శుక్ర, శని, ఆదివారాల్లో కురిసిన వర్షంతో కొంత ఉపశమనం కలిగింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం ఎండగా ఉన్నా, సాయంత్రం ఒక్కసారిగా గాలులతో కూడిన వర్షం మొదలైంది. దీనికి తోడు ఉరుములు, మెరుపులతో నెల్లూరు నగరంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ వర్షంతో నెల్లూరు నగరంలోని రైల్వే అండర్ బ్రిడ్జిలలోకి నీరు చేరింది. ఇళ్ల ఎదుట సైడ్ కాలువల్లో, ప్రధాన మురుగునీటి కాలువల్లో చెత్త పేరుకొని పోవడంతో మురుగునీరు ముందుకు కదలక ఇళ్ల ముందుకు వచ్చి చేరింది. లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలిగింది.

కాంట్రాక్ట్ లెక్చరర్ల సర్వీసు పొడిగింపు

నెల్లూరు(విద్య), జూలై 7 : ఉన్నత విద్యాశాఖ ఆర్‌జేడీ ఆదేశాల మేరకు గత ఏడాది కాంట్రాక్ట్ అధ్యాపకులుగా జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేసిన వారిని ఈ ఏడాది కూడా పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ గిరి ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరంలో పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు తమ దరఖాస్తులతో ఈనెల 9వ తేదీ లోపల కళాశాలలో పసంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నెల్లూరు(హరనాథపురం), జూలై 7 : కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ ఆనంద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఫేక్ లేఅవుట్ కేసులో నిందితులపై చర్యలు

● ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి

పొదలకూరు, జూలై 7: తోడేరులో 17ఎకరాల భూమికి ఫేక్ అప్రూవల్ సృష్టించి అమ్మకాలు సాగించిన కేసుకు సంబంధించి నిందితులపై చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పలు కేసులను పరిశీలించి మాట్లాడారు. కేసుకు సంబంధించి నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆయన వెంట పొదలకూరు సీఐ రాంబాబు, ఎస్‌ఐ రామకృష్ణ ఉన్నారు.

వర్షాకాలంలో పిల్లలు జర భద్రం!

- వానల్లో చిన్నారులకు పొంచి ఉన్న వ్యాధులు
- తల్లిదండ్రుల అప్రమత్తత అవసరం

ఆత్మకూరు, జూలై 7: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచి దోమల ఉధృతి పెరగడంతో పాటు అనేకరకాల వ్యాధులు పొంచి ఉన్నాయని, ముఖ్యంగా చిన్నారులు వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందని తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల్లో ఎక్కువశాతం దోమల కారణంగానే వ్యాప్తి చెందుతాయి. మురుగు నీరు, చెత్తాచెదారం నిల్వ ఉన్నచోట వీటి ఉధృతి పెరుగుతుంది. ప్రాణాంతకమైన డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు వ్యాపిస్తాయి. ఆత్మకూరు నియోజకవర్గంలో దోమల ఉధృతి ఎక్కువైంది. ఎటువంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా అశ్రద్ధ చూపకుండా పరీక్షలు చేయించాలి.



ఆరోగ్య సలహాలు ఇస్తున్న వైద్యురాలు అస్మా

తీసుకోవాల్సిన జాగ్రత్తలు: పాఠశాలల్లో క్లోరినేషన్ చేసిన నీటినే విద్యార్థులు తాగేలా చూడాలి. ఇళ్ల వద్ద తల్లిదండ్రులు కాచిచల్లార్చిన నీటిని ఇవ్వడం శ్రేయస్కరం. తాజా ఆహారం తీసుకోవాలి. తినుబండారాలపై ఈగలు వాలకుండా జాగ్రత్తలు వహించాలి. ఆహారం తినేముందు, తరువాత మల, మూత్ర విసర్జన తరువాత విద్యార్థులు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దృష్టిసారించాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటు బహిరంగ మల, మూత్ర విసర్జన చేయరాదు. డ్రైన్లు, నీరు నిలిచిన చోట కిరోసిన్, బ్లీచింగ్, మడ్డి ఆయిల్, దోమల నివారణ మందులు చల్లుకోవడం మంచిది. వర్షం కురుస్తున్నప్పుడు పిల్లలు బయటకు వెళ్లాల్సి వస్తే తప్పకుండా రెయిన్‌కోటు, గొడుగులు తీసుకెళ్లాలి. ముఖ్యంగా తల తడవకుండా చూసుకోవాలి. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద చెత్తాచెదారం, మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలి. పాఠశాలల్లో సెప్టిక్‌ట్యాంకుల గొట్టాలపై దోమలతెర, ఇనుప జల్లెడులను ఏర్పాటు చేయాలి. ఆరుబయట తినుబండారాలను చిన్నారులు తినకుండా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఉదయగిరి రూరల్, జూలై 7: స్థానిక ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ కార్యాలయంలో ఆదివారం ఆదర్శ యువత-ఆదర్శ సమాజం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐవైఎం జిల్లా, మండల అధ్యక్షుడు ఇందాదుల్లా, మునాఫ్‌లు మాట్లాడారు. ఈ నెల 5 నుంచి 14వ తేదీ వరకు ఆదర్శ యువత, ఆదర్శ సమాజం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశ జనాభాలో 54శాతం మంది యువతే ఉన్నారన్నారు. వారిలో నైతిక విలువలు తీసుకొచ్చి సమాజాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామ్ హింద్ ఉదయగిరి అధ్యక్షులు సిద్దిఖ్, ఎస్ఐవో జిల్లా అధ్యక్షుడు అజరుల్లా, సభ్యులు వహీం పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

ఉదయగిరి రూరల్, జూలై 7: పదవీ విరమణ పొందిన దుద్వూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు షేక్ ముంజీర్‌అహ్మద్‌ను ఆదివారం స్థానిక షాదీమంజిల్‌లో ఉపాధ్యాయులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ఘనంగా సన్మానించారు. 41 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి ఎందరో విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దారన్నారు. ప్రతి ఒక్కరూ ముంజీర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇక నుంచి ఆయన శేషజీవితం ఆనందంగా గడవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవోలు మోహన్‌రావు, ఓబులరెడ్డి, అల్లాభక్షు, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధ్యానంతో వ్యాధుల దూరం

ఆత్మకూరు, జూలై 7: ధ్యానంతో వ్యాధులకు గురికాకుండా ఉండవచ్చని సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ చంద్రా సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం మున్సిపాల్టీ పరిధిలోని టీ.ముస్తాపురం సమీపంలో ఉన్న పిరమిడ్ ధ్యానకేంద్రంలో ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానంతో బుద్ధిబలం పెరగడంతో పాటు రోగాలు దూరమవుతాయన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం ఉపయుక్తమని తెలిపారు. అనంతరం టీ ముస్తాపురం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పిరమిడ్ మాస్టర్లు, ధ్యానసాధకులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మన్‌కు సన్మానం



లైన్‌మన్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

అనంతసాగరం, జూలై 7: విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న సయ్యద్ బషీర్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖాధికారులు, సీఐటీయూ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


పొంచి ఉన్న ప్రమాదం



వెంకటంపేటకు వెళ్లే దారిలో గుంత

ఉదయగిరి, జూలై 7: ఉదయగిరి ప్రాంతంలో ప్రైవేట్ నెట్‌వర్కుల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. రెండురోజులుగా స్థానిక ఏటీఎం చర్చి సమీపం నుంచి వెంకటంపేట వరకు ఓ ప్రైవేటు నెట్‌వర్కు కంపెనీ కేబుల్ పనుల కోసం ప్రధాన రహదారుల వెంట గోతులు తీసింది. ఈ ప్రాంతాల్లో ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. శనివారం ఉదయగిరికి చెందిన ఓ ప్రైవేటు వైద్యుడు కారును అక్కడ ఆ కంపెనీ తరపున పనిచేస్తున్న ఎక్స్‌కవేటర్ తగలడంతో ప్రమాదం తప్పింది.

బకాయి బిల్లులు వచ్చేలా చూడాలి



పూడిక పనులు చేయిస్తున్న ఉపసర్పంచి

అనంతసాగరం, జూలై 7: గ్రామాభివృద్ధికి తాను చేసిన పనులకు సంబంధించి బిల్లులు రాకుండా స్థానిక నాయకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని సోమశిల ఉపసర్పంచ్ మహబుబ్‌బాష వాపోయారు. ఆదివారం స్థానికంగా మురుగుకాలువల పూడికతీత పనులు చేయించారు. సోమశిల పంచాయతీ ఏకగ్రీవ ఎన్నికకు తాను సహకరించానని, తనతో పాటు మరో నాయకుడిని రెండున్నరేళ్ల పాటు పాలన సాగించేలా పెద్దలు పంచాయతీ తీర్మానం చేశారని చెప్పారు. అయితే 2021 నుంచి గ్రామాభివృద్ధి కోసం సుమారు రూ. 7లక్షలు ఖర్చు చేశానని అందుకు సంబంధించిన బిల్లులు రాకుండా నాయకులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

వైభవంగా నాగార్పమ్మ మహోత్సవం



వరికుంటపాడు: పొంగళ్ల సామగ్రితో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



అనంతసాగరం ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఉదయగిరి రూరల్, జూలై 7: సున్నంవారిచింతలలో వెలసిన నాగారపమ్మ మహోత్సవాన్ని ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. వేకు వజామున అమ్మవారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ, కంకణపూజ, నవగ్రహ మండపారాధన అనంతరం నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు. ఊరేగింపుగా బయలుదేరి బండ్లుపొంగళ్ల చేపట్టారు.

వరికుంటపాడు: విరువూరు మారుతీనగర్‌లో వెలసిన గ్రామ దేవతకు ఆదివారం భక్తులు పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. నివాసాల నుంచి ప్రత్యేకంగా అలంకరించిన పాత్రల్లో పొంగళ్ల సామగ్రిని ఊరేగింపుగా అంకాళమ్మ, పోలేరమ్మ ఆలయాలకు చేర్చి ప్రదక్షిణలు చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించడంతో పాటు భక్తులకు పంచి పెట్టారు. సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు, రైతులు పాడిపంటలు, ఆయురారోగ్యాలతో జీవనం సాగించాలని వేడుకున్నారు.

అనంతసాగరం: మండలంలోని పాతదేవరాయపల్లి గ్రామదేవత తుమ్మాలమ్మ తిరునాళ్ల వైభవంగా జరిగింది. మహిళలు పెద్దఎత్తున ఆలయానికి చేరుకొని పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

సంగం: కోలగట్ల పెన్నా నది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సంగం: నాగార్పమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



ఉదయగిరి రూరల్: అలంకరణలో అమ్మవారు

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినం



వరికుంటపాడు: సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 7: స్థానిక సెంటర్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావదినం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల కమిటీల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఏర్పాటు అనంతరమే మాదిగలకు ఆత్మగౌరవం, ఐక్యత, హక్కులు దక్కాయన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గొల్లపల్లి మోహన్‌రావు, గంగపట్ల సింహాద్రి, యద్దనపూడి రమణయ్య, బెజవాడ బాలగురవయ్య పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ తాతిపూడి డేవిడ్ జెండాను ఆవిష్కరించి సంబరాలు జరుపుకున్నారు. అలాగే వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి పంచి పెట్టారు. అనంతరం నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో నాయకులు కాకి అంకయ్య, చేవూరి రవితేజ, కొండిపోగు ప్రసాద్, బక్కా శ్రీనివాసులు, హరి, ప్రభాకర్, యశ్వంత్‌పాల్ పాల్గొన్నారు.

కలువాయి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కలువాయిలో సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చల్లా రఘురామిరెడ్డి, చల్లా శ్రీనివాసులరెడ్డి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు దండు భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



కలువాయి: జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

అన్నా.. ఆ పోస్టు నాకివ్వాలి !

- ఫీల్డ్ అసిస్టెంట్, రేషన్ డీలర్ పోస్టులకు భారీగా డిమాండ్
- ఒక్కో గ్రామంలో ఐదు నుంచి ఏడుగురి పోటీ
- తలలు పట్టుకుంటున్న ద్వితీయశ్రేణి నాయకులు

ఉదయగిరి రూరల్, జూలై 7: ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, రేషన్ డీలర్ల పోస్టులకు ఆశావహుల నుంచి పోటీ పెరిగింది. పలు గ్రామాల్లో తమ కంటే తమకే పోస్టులు ఇప్పించాలని టీడీపీ కార్యకర్తలు పోటీ పడుతున్నారు. దీంతో పార్టీలోని ద్వితీయశ్రేణి నాయకులు తలలు పట్టుకుంటున్నారు. నియోజకవర్గంలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు ఒక్కో గ్రామంలో ఐదు నుంచి ఏడుగురి వరకు పోటీ పడుతున్నారు. పోటీపడే వారంతా ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేసిన వారే. రేషన్ డీలర్ల నియామకానికి కూడా ఇదే స్థాయిలో డిమాండ్ ఉంది. ఇప్పటికే పలువురు డీలర్లు రాజీనామా చేశారు. అలాగే వలంటీర్ పోస్టులకు కూడా పోటీ తీవ్రంగానే ఉంది.

రూ. లక్షలు ఇచ్చేందుకు సిద్ధం

ఆయా పోస్టులు దక్కించుకునేందుకు ఆశావహులు రూ.లక్షలు ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీన్ని బట్టి చూస్తుంటే ఆ పోస్టులకు ఎంత డిమాండ్ ఉందో అర్థం అవుతుంది. పోటీ అధికంగా ఉండడంతో ఆశావహులు ఎవరికి వారే తమ తమ మార్గాల్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వద్దకు క్యూకడుతున్నారు.

సమష్టి నిర్ణయంతో ఎంపిక

ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన వారికే తగిన గుర్తింపు ఇచ్చేలా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముందుకు వెళుతున్నట్లు సమాచారం. మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి నేతలందరి సమష్టి నిర్ణయం మేరకే పోస్టులు భర్తీ చేస్తామని ఆయన పార్టీ నేతలకు సూచించినట్లు తెలిసింది.

ఫీల్డ్ అసిస్టెంట్లలో ఆందోళన

గత వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లలో ఆందోళన నెలకొంది. ఉపాధి హామీ పథకంలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలను బయటకు తీయాలని ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. సామాజిక తనిఖీలు కూడా సక్రమంగా జరగలేదని, బినామీ మస్టర్లు, మొక్కలు నాటకుండానే నాటినట్లు బిల్లులు స్వాహా చేశారని, తదితర వాటిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్లలో ఆందోళన నెలకొంది.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

సీపీఐ నేత చౌడారెడ్డికి ఘన నివాళి

కందుకూరు, జూలై 7: సీపీఐ నేత చౌడారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, నాయకులు ఆనంద్‌మోహన్, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు బోట్లను నిలువరించండి

- ఆరోగ్య శాఖా మంత్రికి మత్స్యకార నాయకుల వినతి

అల్లూరు, జూలై 7: తమిళనాడుకు చెందిన బోట్లు నెల్లూరు, ప్రకాశం జిల్లాల తీరప్రాంతాల్లో చేపల వేటను సాగిస్తూ స్థానిక మత్స్యకారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నందున వాటిని నిలువరించి మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని అల్లూరు మండలం ఇస్కపల్లిపాలెంకు చెందిన మత్స్యకార నాయకుడు కొండూరు మాధవ్ రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. ఆదివారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆయన్ను కలుసుకొని స్థానికంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కడలూరు, కారకలై ప్రాంతాలకు చెందిన బోట్లు అక్రమంగా సముద్రంలో తమ భూభాగంలోకి చొరబడి చేపల వేటను కొనసాగిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా, నెల్లూరు జిల్లాల్లో ఈవిధంగా గత కొంత కాలంగా అక్రమ వేటను కొనసాగిస్తుండడంతో తమ ప్రాంత మత్స్యకారులకు జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని పేర్కొనడంతో, ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు వావిల సుధాకర్, ప్రళయకావేరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మంత్రిని అభినందిస్తున్న కొండూరు మాధవ్

సాయిసాధుడికి ప్రత్యేక పూజలు



మాట్లాడుతున్న మందిర వ్యవస్థాపకులు

బిట్రగుంట, జులై 7: బోగోలు మండలం బిట్రగుంట ద్వారకా నగరులోని శేషసాయి మందిరంలో ఆదివారం షిర్డి శేషసాయిసాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, ఈనెల 21న జరుగు గురుపౌర్ణమి వేడుకలకు సంబంధించి మందిర వ్యవస్థాపకుడు కుట్టుబోయిన బ్రహ్మానందం ఆధ్వర్యంలో కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ 19, 20, 21 తేదీల్లో ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలతో పాటు అంతర్ జిల్లా ఎడ్ల బండలాగుడు పోటీలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో శ్రీనివాసులు, బాలయ్య, సుబ్రహ్మణ్యం, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ

కావలిటౌన్, జూలై 7: టీవీఎస్ మెమోరియల్ ట్రస్ట్‌చే ఆదివారం పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు తన సొంత నిధులతో చేపట్టిన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులతో పాటు పలువురు సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జీ హరనాథ్, సుబ్బరాయశర్మ, మాల కొండారెడ్డి, జమీర్, శివయ్య, మురళీకృష్ణ పాల్గొన్నారు.

రక్తదానం

కావలిటౌన్, జూలై 7: లైఫ్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తాడికొండ నవీన్ తన తండ్రి రామమూర్తి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం రెడ్‌క్రాస్ రక్తనిధిలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు కృష్ణయ్య, మధురెడ్డి, మేడం కాటంరెడ్డి, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

బ్రాహ్మణ మహా సంఘం కార్యవర్గం ఎన్నిక

కావలిటౌన్, జూలై 7: పట్టణ పాతూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం బ్రాహ్మణ మహాసంఘం అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం ఎన్నికల అధికారిగా రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం కాగా నూతన కార్గవర్గంచే ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. గతంలో బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో అనేక సేవాకార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినందున అదే కార్యవర్గంలోని అన్ని పోస్టులు ఏకగ్రీవమయ్యాయన్నారు.

కాపు హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా అడపా రంగయ్య



లింగసముద్రం, జూలై 7: కందుకూరు నియోజకవర్గ కాపు హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా లింగసముద్రం టీడీపీ నాయకుడు అడపా రంగయ్య ఎంపికయ్యారు. ఈమేరకు కాపు హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి ఫణి కుమార్ నుండి రంగయ్యకు ఉత్తర్వులు అందాయి. కందుకూరు నియోజకవర్గ బాధ్యతలు చేపట్టి కాపు కమ్యూనిటీకి చెందిన కులాలు మరియు ఉప కులాల అభ్యున్నతికి, అభివృద్ధికి కృషి చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఫణి కుమార్ పేర్కొన్నారు. తనపై నమ్మకముంచి అప్ప గించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు కృషిచేస్తానని రంగయ్య చెప్పారు. ఈసందర్భంగా రంగయ్యను పలువురు అభినందించారు.

టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలిగా షేక్ అర్షియా బేగం నియామకం



కావలి, జూలై 7: కావలి పట్టణ టీడీపీ మహిళా అధ్యక్షురాలిగా షేక్ అర్షియా బేగంను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ నియామక పత్రం పంపించారు. గతంలో టీడీపీ మహిళా అధ్యక్షురాలిగా ఉన్న ద్రోణాదుల వాసంతి సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. దీంతో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సూచన మేరకు షేక్ అర్షియా బేగంను నూతన అధ్యక్షురాలిగా జిల్లా అధ్యక్షుడు నియ మించారు.

డిప్లమా కోర్సుతో ఉద్యోగావకాశాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణమోహన్

కందుకూరు, జూలై 7: డిప్లొమా మూడేళ్ల చిన్న కోర్సు అయినా ఉద్యోగం, ఉన్నత చదువుల్లో ఉజ్వలమైన అవకాశాలుంటాయని ఎన్నారై ఎంఎస్సీ సీటీఓ సిహెచ్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా విద్యార్థినీ, విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణమోహన్ మాట్లాడుతూ ఉన్నతవిద్య పట్ల ఆసక్తి ఉంటే మూడేళ్లలోనే బీటెక్ డిగ్రీ పూర్తిచేసుకుని పీజీ కోర్సులకు వెళ్లేందుకు కూడా అవకాశం ఉంటుందన్నారు. కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ డిప్లొమా అంటే సమాజంలో చిన్నచూపు ఉందని, కానీ డిప్లొమా ద్వారా అద్భుతమైన అవకాశాలు అందిపుచ్చుకునే పరిస్థితులు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టరు సిహెచ్ రవికుమార్, అకడమిక్ ఇన్‌చార్జిలు మీరావలి, గురుశేషు, సులోచన పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘంలో అల్లూరీయులకు స్థానం



అల్లూరు మండలం నుంచి ఎంపికై ప్రమాణం చేస్తున్న బ్రాహ్మణ సేవాసంఘం నాయకులు

అల్లూరు, జూలై 7: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘంలో కార్యవర్గ సభ్యులుగా అల్లూరు బ్రాహ్మణులకు స్థానం దక్కింది. ఆదివారం నెల్లూరులో నిర్వహించిన కార్యవర్గ ఎంపికలో అల్లూరుకు చెందిన బ్రాహ్మణ సేవా సంఘంలోని సభ్యులకు జిల్లా నూతన కార్యవర్గంలో స్థానం దక్కడంతో అల్లూరు మండల బ్రాహ్మణ సంఘం హర్షం వ్యక్తం చేసింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా కామకొలను వేంకట రాధాకృష్ణారావు, కార్యవర్గ సభ్యులుగా గూడా సుధాకర్‌రావు, ధూళిపాళ్ల గోపాల్, కాళహస్తి రాధాకృష్ణతోపాటు మహిళా విభాగంలో సంయుక్త కార్యదర్శిగా అన్నదాత రమాదేవి, అర్చక సమాఖ్య విభాగంలో ఉపాధ్యక్షుడిగా ముప్పిరాల అనీల్ శర్మ, జిల్లా అర్చక పురోహిత ఉపాధ్యక్షుడిగా ఉదయగిరి వేంకట ఫణిసాగర్ దీక్షితులు, యువజన ఉపాధ్యక్షుడిగా కారుమంచి కార్తీక్ శర్మ, కార్యవర్గ సభ్యులుగా కోదాటి నాగార్జున శర్మ, కారుమంచి సుబ్బారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అల్లూరు మండలం నుంచి ఇంతమంది జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గ సభ్యులుగా నియమితులవడంతో బ్రాహ్మణ సమాజం శుభాకాంక్షలు తెలిపింది.

చినుకు పడితే రైతుబజారు రొచ్చు రొచ్చు..



రైతుబజారు ప్రధాన ద్వారం వద్ద రొచ్చు రొచ్చుగా ఉన్న దారి

కావలి, జూలై 7: చినుకు పడితే చాలు కావలి రైతుబజారు రొచ్చురొచ్చుగా మారి అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు బజారులోకి వెళ్లే రెండు ప్రధాన ద్వారాల నుంచి రాకపోకలు సాగించాలంటే బురదలో నడవాల్సి వస్తోంది. వర్షపు నీరు రోడ్డుపై నిలవడంతో రైతుబజారుకు వచ్చిన వినియోగదారులు తమ ద్విచక్ర వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేయాల్సి వస్తోంది. దీంతో ఆమార్గంలో రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అలాగే రైతు బజారు ముందు వాహనాల పార్కింగ్‌కు అవకాశం లేకుండా ఆక్రమణదారులు ముందుకు రావడంతో రైతుబజారులోకి కూరగాయలు కొనుగోలుకు రాకపోకలు సాగించాలంటే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికలకు ముందు అక్కడ ఉన్న డ్రైనేజిలో పూడిక తీసి దానిని తరలించకుండానే అక్కడ రోడ్డు చదును చేశారు. దీంతో వర్షం పడితే ఆనీరు కాలువలోకి వెళ్లకుండా నిలబడి రొచ్చురొచ్చుగా తయారవుతోంది. దీంతో ఆరోడ్డుపై నడిచే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి రోడ్డు వెంబడి ఉన్న పూడిక మట్టిని తొలగించి అక్కడ వర్షపునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని, రైతు బజారు ముందు ఉన్న ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కలుషిత నీటితో ప్రజల అవస్థలు



పచ్చరంగులో ఉన్న మంచి నీరు

లింగసముద్రం, జూలై 7: రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా ఉన్న భారీ మంచినీటి పథకాల ద్వారా వచ్చే మంచినీరు చాలా కాలం నుంచి రంగుమారి కలుషితమై వస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు ఆధారంగా గుడ్లూరు ఫేస్-1, ఫేస్-2 మంచినీటి పథకాల నుంచి లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోని 54 గ్రామాలకు, రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకాల నుంచి 48 గ్రామాల పరిధిలోని ప్రజలకు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఈ పథకాల నుంచి వచ్చే నీరు పచ్చరంగులో కలుషితమై వస్తోందని పెదపవని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దనుం మధు మరికొందరు చెప్పారు. ఈ నీటితో స్నానం చేస్తే దురదలు వస్తున్నాయని చెప్పారు. అంతేగాక నీటిలో చిన్న చిన్న పురుగులు కూడా ఉంటున్నాయని, దీంతో ప్రజలు ఈ నీటిని తాగడం లేదన్నారు. ప్రజలు రూ.10 పెట్టి మినరల్ వాటర్‌ను కొంటున్నారని ఆయన చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కావలి టౌన్: జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నేతలు

కావలి టౌన్, జూలై 7: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ట్రంకురోడ్డులోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సీనియర్ నాయకుడు కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు మందా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ ఒక కుల సంఘంగా ఏర్పడిన ఎమ్మార్పీస్ సమాజహితం కోరే గొప్ప ఉద్యమ సంస్థగా అవతరించిందన్నారు. కార్యక్రమంలో గేరా జానకి, కత్తి శివయ్య, చేవూరు వరప్రసాద్, జార్జి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం బేతనీపేటలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బోగోలు పట్టణాధ్యక్షుడు మర్లపాటి మోషేబాబు ఆధ్వర్యంలో ఆదివారం జరిగాయి. జెండా ఆవిష్కరణ చేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పోతల శీనయ్య, గ్రామపెద్దలు తదితరులు ఉన్నారు.

కలిగిరి: కలిగిరి పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండల అధ్యక్షుడు నందిపోగు వెంగలరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ పోరాటంలో అశువులు బాసిన మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో వర్లా కొండయ్య, గోసాల కొండలరావు, ఐమూరి మోజేస్, బొర్రా వెంగళరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సమస్యల తిష్ఠ

● అవస్థల్లో రోగులు, ఉద్యోగులు ● అపరిశుభ్రంగా తాగునీరు, మరుగుదొడ్లు

మనుబోలు, జూలై 7: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలతో రోగులు అవస్థలు పడుతున్నారు. వారంలో రెండురోజులకోసారి జిల్లా, రాష్ట్రస్థాయి వైద్యాధికారులు వస్తూనే ఉంటారు కానీ పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్ళవుతున్నా కొత్త వైద్యశాల నిర్మాణం పూర్తికాలేదు. దీంతో పీహెచ్‌సీలో పనిచేసే ఉద్యోగులు, వైద్యం కోసం వచ్చే రోగులకు అవస్థలు పడుతున్నారు. మండలంలో మనుబోలులో తప్ప రెండో పీహెచ్‌సీ లేదు. పైగా జాతీయరహదారి పక్కనే ఉండడంతో దీనిని 24గంటల వైద్యశాలగా రికార్డుల్లో మార్చారు. అయితే అందుకుతగ్గ సేవలు మాత్రం శూన్యం. పాతికేళ్ళ క్రితం పీహెచ్‌సీ నిర్మించడంతో శిథిలావస్థలో ఉంది. టాయిలెట్లు అధ్వానంగా తయారయ్యాయి. తాగునీటి సమస్యతో రోగుల అవస్థలు వర్ణనాతీతం. వర్షాకాలమైతే రోడ్డుపై పారేనీరంతా పీహెచ్‌సీలో ఉంటుంది. పైగా అన్ని గదులు ఉరుస్తుంటాయి. మందులు, ఇతరసామాగ్రి భద్రపరిచేందుకు సిబ్బంది తంటాలు పడుతుంటారు. ఇక ఆపరేషన్ థియేటర్ మరీ అధ్వాన్నంగా ఉంది. పీహెచ్‌సీలో కు.నీలు, ప్రసవాలు మాట విని పదేళ్ళు కావస్తోంది. అప్పుడప్పుడు వచ్చే రోగులకు పడుకునేందుకు ఉండే నాలుగు బెడ్లు చిరిగిపోయి, మురికిగా దర్శనమిస్తుంటాయి. ఒక్క మనుబోలులోనే సుమారు పదివేల మంది జనాభా ఉంటారు. పీహెచ్‌సీలో ఓపీ మాత్రం 50మందికి మించరు. సాధారణ రోజుల్లో సిబ్బంది ఉదయం 9నుంచి సాయంత్రం 4వరకే ఉంటారు. ఆదివారమైతే పీహెచ్‌సీలో ఒక్కరూ కానరారు. దీంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.



నాలుగేళ్లుగా సాగుతున్న కొత్త వైద్యశాల నిర్మాణం



పీహెచ్‌సీలో చిరిగిఉన్న బెడ్‌లు

నాలుగేళ్లుగా సాగుతున్న కొత్త పీహెచ్‌సీ నిర్మాణం

పాత పీహెచ్‌సీ శిథిలావస్థకు చేరడంతో కొత్త పీహెచ్‌సీ భవనాన్ని 2020లో అప్పటి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంజూరు చేయించారు. అయితే నాలుగేళ్ళు గడుస్తున్నా ఇంతవరకు పీహెచ్‌సీ నిర్మాణం పూర్తికాలేదు. దీంతో, కొత్త పీహెచ్‌సీ నిర్మాణం ఎప్పుడు పూర్తిచేస్తారా అని వైద్యసిబ్బంది ఎదురుచూస్తున్నారు. మందులు భద్రపరుచుకు నేందుకు పాత పీహెచ్‌సీలో గదుల కొరత ఉంది. దీంతో రోగులు పడుకునే మంచాలపైన, ఆపరేషన్ థియేటర్‌లలో ఉంచుతున్నారు. ఇకనైనా జిల్లా వైద్య ఉన్నతాధికారులు స్పందించి ఇటు రోగులు, అటు ఉద్యోగులు పడుతున్న అవస్థలపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, జూలై 7: పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహగాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి, ఆశ్రమ మేనేజర్ మనోజ్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

వేలిముద్ర వేయించుకుని.. పింఛన్ నగదు ఇవ్వలేదు !

● రెండు రోజుల్లో ఇస్తామన్నారు... వెనక్కి వెళ్లాయన్నారు

● వవ్వేరు పెన్షన్‌దారుల ఆవేదన.. ఆలస్యంగా వెలుగులోకి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 7: మండలంలోని వవ్వేరు గ్రామ దళితవాడకు చెందిన అరవ బుజ్జమ్మ ఈ గత నెలలో కంటి ఆపరేషన్ నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వుంది.. జూన్ 6వ తేదీ వవ్వేరుకు వచ్చి కార్యదర్శి వద్దకు వెళ్లింది. ఫించను డబ్బు కోసం తంబ్ వేసింది. వేయించుకున్న అధికారులు 8న ఇస్తామని వాయిదా వేశారు. వాయిదా మేరకు అదేరోజు వెళ్లి అడిగితే జూలైలో ఇస్తామన్నారు. అప్పటివరకు ఎదురు చూసిన బుజ్జమ్మ ఈనెలలో అడిగితే వెనక్కెళ్లాయని చెప్పడంతో ఆమె ఆశలు ఆవిరయ్యాయి. అసహనంతో స్థానికంగా పలువురికి చెప్పుకుని కన్నీటిపర్యంతయ్యింది. వేలిముద్ర వేయించుకుని పించను ఎందుకివ్వరని ప్రశ్నిస్తే నీవు మినిస్టర్ అయివుంటే బాగుండేదని ఎగతాళి చేశారని బుజ్జమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. గ్రామంలోని ఒట్టికాళ్ళ శ్రీనివాసులు పింఛన్ విషయంలోనూ అధికారులది ఇదే సీన్. తెలిసి ఇవి.. తెలియకుండా ఇంకా కొన్ని వున్నట్టు గ్రామంలో విమర్శలు ఉన్నాయి. ఈ విషయంపై ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను వివరణ కోరగా పింఛన్లు వెనక్కు పంపామన్నారు.

వరిసాగులో కలుపు యాజమాన్యం

● తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కేవీకే శాస్త్రవేత్త సూచనలు



వరిపైరును పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు(ఫైల్)

నెల్లూరు(వ్యవసాయం), జూలై 7 : జిల్లాలో వరిసాగు జోరుగా సాగుతోంది. వరిసాగులో కలుపు సర్వసాధారణమై పోయింది. ఇది రైతులకు అదనపు భారంగా మారింది. డెల్టా కింద సాగవుతున్న వరిసాగులో కలుపు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సేద్యవిభాగం శాస్త్రవేత్త డాక్టర్ కే కిరణ్ కుమార్‌రెడ్డి ఆంధ్రజ్యోతి ద్వారా రైతులకు వివరించారు. నాట్లు వేసిన 3 నుంచి 5 రోజులలోపు పొలంలో పలుచగా నీరుపెట్టి 20కిలోల పొడి ఇసుకలో ఎకరాకు 12గ్రాముల పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 70శాతం డబ్ల్యూడీపీ మందు లేదా లీటరు బుటాక్లోర్ 50శాతం ఈసీ లేదంటే 400మి.లీ ప్రెటిలాక్లోర్ 50శాతం ఈసీ కలిపి పొలంలో సమానంగా వెదజల్లాలి. గడ్డి, తుంగ, వెడల్పాటి ఆకులున్న కలుపు మొక్కలు సమస్యగా ఉంటే 3 నుంచి 5 రోజుల లోపు పొలంలో పలచగా నీరుపెట్టి 20కిలోల ఇసుకలో నాలుగు కిలోల బెన్ సల్ఫ్యూరాన్ మిథైల్ 0.6శాతంతోపాటు ప్రెటిలాక్లోర్ 6.0శాతం గుళికలు ఎకరం పొలంలో సమానంగా పడేలా వెదజల్లుకోవాలి.

● **20రోజులకు వాడదగిన కలుపు మందులు**

పొలంలో 20 రోజులకు గడ్డిజాతి కలుపు గుర్తిస్తే నివారణకు సైహలోఫాప్ పీ బులైట్ 10శాతం ద్రావకం 400మి.లీ 200లీటర్ల నీటిలో కలిపి ఎకరాకి పిచికారీ చేయాలి. వెడల్పాకు, గడ్డిజాతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తిస్తే బిస్పైరిబాక్ సోడియం 10శాతం ఎస్.ఎల్ ద్రావకం 100మి.లీ లేదంటే ట్రైపోమోన్, ఇథాక్సీ సల్ఫ్యూరాన్ 30 శాతం డబ్ల్యూజి 90గ్రాములు ఎకరానికి 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పుల్ల విరుపు గడ్డి, ఉర్రంకి ఎక్కువగా ఉన్నట్లయితే ఫెనోక్సాప్రాప్ పి ఇథైల్ 6.9ఇ.సి 350మి.లీ ఎకరానికి 200లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలని ఆయన వివరించారు.

పెంపుడు గడ్డి, దాణాలతో అధిక పాలదిగుబడులు

● పశుగ్రాస వారోత్సవాల్లో ఉప సంచాలకులు రమేష్‌నాయక్



బుచ్చి: పాడిరైతులకు ఉచితంగా లివర్‌టానిక్ పంపిణీ చేస్తున్న ఉప సంచాలకులు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 7: పాడిరైతులు తక్కువఖర్చుతో తయారు చేసుకునే పెంపుడు గడ్డి, దాణాలతో పాడిపశువుల్లో పాలు, వెన్నశాతాలు పెరిగి అధిక పాల ఉత్పత్తులు పొందవచ్చని కావలి పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ కే.రమేష్‌నాయక్ అన్నారు. ఆదివారం బుచ్చి ప్రాంతీయ పశు వైద్యకేంద్రంలో సంయుక్త సంచాలకులు కోటేశ్వరరావు ఆదేశాలతో ప్రాంతీయ పశువైద్యాధికారి ప్రసన్నాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపసంచాలకులు మాట్లాడారు. వర్షకాలంలో సుబాబులు ఆకులను గేదెలకు ఎక్కువ మేతగావేస్తే గర్భంపోయే (అభార్షణ) అవకాశాలున్నాయ్నారు. అదికూడా ఆకు పసుపురంగు సమయంలో వాడాలని పాడిరైతులకు సూచించారు. స్వతహాగా దాణా తయారు చేసుకునే విధానంతో పంటలు లేని కాలాల్లో కూడా ఎండుగడ్డి ఇతర మిశ్రమాలు గురించి వివరిస్తూ సంవత్సరంలో 365రోజులూ మేత అందుబాటులోకి తెచ్చుకునే విధానం గురించి తెలిపారు. ప్రతి గ్రామంలో రైతు సేవాకేంద్రాలతో పశుసంవర్ధకశాఖ అధికారులు, సిబ్బందితో సేవలు, సబ్సిడీ గడ్డి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గేదెలకు ఆకలి,బలం పెంచే లివర్ టానిక్ పాడి రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జైపాల్, డాక్టర్ శివతేజారెడ్డి, రైతు దొడ్ల కోదండరామిరెడ్డి, ఆ శాఖ సహాయకులు మనోజ్, వీఎల్‌ఓ శ్రీనివాసులు, జేవీఓ నవాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు అద్దంకి మస్తాన్‌రావు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 7: అద్దంకి మస్తాన్‌రావు ఆదర్శ ఉపాధ్యాయుడు అని యూటీఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు బాబురెడ్డి అన్నారు. ఆదివారం బుచ్చిరెడ్డిపాళెం షాదీమంజిల్‌లో జరిగిన ఉపాధ్యాయుడు అద్దంకి మస్తాన్‌రావు పదవీవిరమణ మహోత్సవంలో బాబురెడ్డితో పాటు పలువురు ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు. ముందుగా మస్తాన్‌రావును పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు వీవీ శేషులు, ఎఎస్‌పేట ఎంఈఓ, బుచ్చి ఎంఈఓ-2 పీవీ రత్నం, కావలి యడవల్లి హెచ్‌ఎం శ్రీకాకులన్‌హెచ్‌ఎం పోతులూరు, గౌస్‌భాష, మోహన్, రఘునాథ్ పాల్గొన్నారు.



మస్తాన్‌రావును సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

రోగులకు పండ్లు పంపిణీ

విడవలూరు, జూలై 7: ముదివర్తి హరిజనవాడలోని చర్చిలో రోగులు, వృద్ధులకు చర్చి సంఘ కాపరి భూపతి లూథరన్, శామ్యూల్, భూపతి సాత్వికంలు ఆదివారం పండ్లు, బ్రెడ్లు, కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ అయ్యవారమ్మ, సంఘ పెద్దలు చిన్నిబాబు, నీలిమ, వెంకటరమణయ్య, మమత, రమేష్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న సంఘకాపరి, సంఘం సభ్యులు

వారాహిదేవి హోమం

సైదాపురం, జూలై 7: మండల పరిధిలోని సిద్దేశ్వర కోన ఆవరణలో ఉన్న దక్షిణామూర్తి ఆలయంలో ఆలయ వ్యవస్థాపకుడు పొలదుగు వెంకట సాయి ఆధ్వర్యంలో ఆదివారం వారాహి దేవి హోమం, పూజలు నిర్వహించారు. వారాహి దేవి నవరాత్రుల్లో భాగంగా రెండోరోజు వారాహి దేవి హోమం, దక్షిణామూర్తి, నాగలింగేశ్వర స్వాముల వారికి రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు మాచవోలు బాల సుబ్రహ్మణ్యం స్వామి పాల్గొని హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనం చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వారాహిదేవి హోమంలో పాల్గొన్న భక్తులు

పదవీ విరమణ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

ఉదయగిరి రూరల్, జూలై 7: స్థానిక షాదీమంజిల్‌లో ఆదివారం దుత్తలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తూ గతనెల 30న పదవీ విరమణ పొందిన షేక్ మున్జీర్ అహ్మద్‌ను ఉపాధ్యాయులు, బంధువులు, స్నేహి తులు, శ్రేయోభిలాషులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ 41 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి, ఎంతోమంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దారన్నారు. ప్రతిఒక్కరూ మున్జీర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇక నుంచి ఆయన శేషజీవితం ఆనందంగా గడపాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవోలు మోహన్‌రావు, ఓబులరెడ్డి, అల్లాభక్షు, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎండీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.



మున్జీర్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

17 నుంచి రొట్టెల పండుగ

● ఈద్గాలో మొహర్రం నిషాన్ ప్రతిష్ఠ

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 7: నెల్లూరు దర్గామిట్టలోని బారాషహీద్ దర్గాలో ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు రొట్టెల పండుగ నిర్వహించనున్నట్లు మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటించారు. ఇస్లాం క్యాలెండరులో మొదటి నెల మొహర్రం ఆదివారం నుంచి ప్రారంభమైంది. చంద్రవంక దర్శనంతో ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా మొహర్రం (పీర్లు) చావిడిలు అందంగా అలంకరించి, పవిత్ర పూజలు, ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నగరంలోని బారాషహీద్ ఈద్గాలో మొహర్రం నెల ప్రారంభం సూచకంగా నిషాన్ (జెండా) ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో జరిగింది. బారాషహీద్‌ల సమాధులను కడిగి శుభ్రం చేసి ప్రార్థనల అనంతరం సమాధులకు సందల్‌మాల్ చేసి, కొత్త గలీఫాలు కప్పారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ కుదావన్, పోలీసు అధికారులు, టీడీపీ మైనారిటీ అధికారులు పాల్గొన్నారు. అనంతరం రొట్టెల పండుగ తేదీలను ప్రకటించారు. ఈ నెల 17వ తేదీ సందన్‌మాలీ, 18న బారాషహీద్‌ల గంధమహోత్సవం, 19న తెల్లవారు జామున నుంచి రొట్టెల పండుగ ప్రారంభం, 20న తహలీల్ ఫాతేహా, 21వ తేదీ ముగింపు కార్యక్రమాలు జరుగుతాయని రూరల్ ఎమ్మెల్యే, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు, మైనారిటీలు హర్షధ్వనాలు మధ్య ప్రకటించారు.



బారాషహీద్‌దర్గాలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న గిరిధర్‌రెడ్డి

● **భక్తుల ఆకాంక్షల మేరకే రొట్టెల పండుగ**

తమ కోర్కెలు తీరుతాయన్న విశ్వాసంతో సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు సంతోషంగా తిరిగివెళ్లేలా, వారి ఆంక్షల మేరకు రాష్ట్ర పండుగ రొట్టెల పండుగను నిర్వహిస్తామని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మైనార్టీ నాయకులతో కలిసి బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ పనులను పరిశీలించారు. ముందుగా దర్గాలో రొట్టెల పండుగ విజయవంతం కావాలని ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర మంత్రులు పొంగూరి నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, రూరల్ శాసన సభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిల ఆలోచనలు, సూచనల మేరకు దర్గా ప్రాంతంలో రొట్టెల పండుగ పనులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు కూడా రొట్టెల పండుగ ఏర్పాట్లను గురించి ప్రతీరోజు వాకబు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ప్రవేశించిన భక్తులకు తిరిగి జిల్లా దాటే వరకు పూర్తి భద్రతను ప్రభుత్వం కల్పిస్తామన్నారు. టీడీపీ మైనారిటీ నాయకులు సయ్యద్ సమీ మాట్లా డుతూ మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకునే రొట్టెల పండుగ రాష్ట్ర పండుగగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, సాబీర్, మైనార్టీ నాయకులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న జనసేన నాయకులు

● **దర్గాలో సకల సౌకర్యాలు : జనసేన**

నెల్లూరు(క్రైం) : బారాషహిద్ దర్గాలో రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రజా ప్రభుత్వంలో సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తెలిపారు. ఆదివారం ఆయన జనసేన నాయకులతో దర్గాలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ఐదేళ్లకు పూర్వం దర్గాలో ఆగిన అభివృద్ధి పనులు మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు అజీజ్ బాయ్ ఆధ్వర్యంలో తిరిగి ప్రారంభమయ్యాయన్నారు. రొట్టెల పండుగ నెల్లూరుకు తలమానికమని, అన్ని పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు సహకరించి బయట ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న భక్తులకు సహకారం అందించాలన్నారు. ఈ పండుగకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిని తీసుకు రావాలని మత గురువులు కోరాగా పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పవన్‌కల్యాణ్ వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్‌గౌడ్, హేమచంద్ర యాదవ్, మౌనిష్, పాల్గొన్నారు.



ఈద్గాలో ప్రతిష్ఠించిన నిషాన్

మంత్రి ఆనంకు అభినందనలు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 7: రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆదివారం అఖిల భారత రాయల్ క్రాఫ్ట్ అధ్యక్షురాలు బోళ్ల దేవీనాయుడు, హైకోర్టు న్యాయవాది బోళ్ల బాలాజీ, అఖిల భారత రాయల్ క్రాఫ్ట్ ప్రధాన కార్యదర్శి తోట కృష్ణయ్యలు నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛంఅందజేసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి శ్రీశైలంలో కాపు కళ్యాణ మండపం, వసతి గృహ సముదాయాలకు 3 ఎకరాల స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. దీంతో మంత్రికి అఖిల భారత కాపు, బలిజ, తెలగల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో అఖిల భారత రాయల్ క్రాఫ్ట్ జాతీయ నాయకులు

జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి
నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 7 : నగరంలోని డీఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని 26 మండలాల బ్రాహ్మణ సంఘాల సభ్యులు తమ కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ముఖ్య అతిథిగా నెల్లూరు ఆర్డీవో మాలోలా పాల్గొన్నారు. ప్రణీత గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్, కామరాజు అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రణీత్ నరేంద్ర, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీప్రసాద్‌లు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆర్డీవో మాలోలా మాట్లాడుతూ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో ప్రవేశించాలన్నారు. ధనిక, పేద, బ్రాహ్మణులనే భావన లేకుండా పరస్పరం ఒకరినొకరు సహాయ సహకారాలు అందించుకోవాలని కోరారు. బ్రాహ్మణులు ఐక్యత సాధించినప్పుడే రాజకీయంగా ఎదుగుతారని ప్రతి ఒక్కరూ గుర్తిం చుకోవాలని సూచించారు. బ్రాహ్మణులకు తనవంతుగా సహాయ సహకారాలు ఉంటాయన్నారు. నూతన అధ్యక్షుడుగా గుడ్లదొన వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శిగా ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, కోశాధికారిగా దుద్దుకూరు ప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా గడ్డం విజయలక్ష్మి, కార్యద ర్శిగా సురభి ఉమాదేవీ, యువజన విభాగం అధ్యక్షుడుగా రామాయణం మణిశంకర్, కార్యదర్శిగా గుండ్లపూడి వెంకటసుబ్రహ్మణ్యంశర్మ, అర్చక పురోహిత విభాగం అధ్యక్షుడుగా వేదగిరి ఫణి కుమార్‌శర్మ, కార్యదర్శిగా నూతలపాటి వెంకటసుబ్బయ్య, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు ప్రసాదాచార్యులు, కార్యదర్శి ఉదయగిరి వెంకటశేషాచార్యులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న గుడ్లదొన వాసుదేవరావు

రాష్ట్ర ఖజానాను వైసీపీ ప్రభుత్వం ఖాళీ చేసింది : అజీజ్

నెల్లూరు(వైద్యం), జూలై 7 : రాష్ట్ర ఖజానాను వైసీపీ ప్రభుత్వం ఖాళీ చేసిందని, అయినా ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు చంద్రబాబు నాయుడు పింఛను పెంచి ఇంటి వద్దనే అందించారని నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో పింఛను పెంపును హర్షిస్తూ దివ్యాంగులతో కలిసి నేతలు సంబరాలు జరుపుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పింఛన్ల విషయంలో వైసీపీ నేతలు టీడీపీ నేతలపై బురదచల్లారన్నారు. వలంటీర్లు లేకుండా కేవలం సచివాయం ఉద్యోగుల ద్వారా పింఛన్లు పంపిణీ చేశామని తెలిపారు. కోర్టు ఆదేశాలు మేరకు సచివాలయ సిబ్బందిని వినియోగించకుండా అవ్వాతాతలను మంచాలపై తీసుకు వచ్చి వారిని హత్య చేశారని, ఆ నిందను చంద్రబాబుపై మోపారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో 20 మంది అవ్వాతాతలను చంపించింది వైసీపీ ప్రభుత్వమేనని దుయ్యబట్టారు. చంద్రబాబు పాలన సామర్థ్యంతో రాష్ట్రాన్ని రాష్ట్ర బిడ్డల భవిష్యత్తును తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, నేతలు మన్నెం పెంచలనాయుడు, అనంతనేని బాబుచౌదరి, తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులతో టీడీపీ నేతలు

నిత్యావసర వస్తువుల వితరణ

నెల్లూరు(హరనాథపురం), జూలై 7: నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయానికి నిమ్మకంటి గౌతమ్ పుట్టిన రోజును పురస్కరించుకుని మానవ సేవయే మాధవ సేవ టీం నిర్వాహకులు పరిమళ, ప్రఫుల్లా, నారాయణరాజు, విజయమ్మ, సురేష్ నిత్యావసర సరకులను అందచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ హంస అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ వాత్సల్యకు నిత్యావసర సరకులను అందచేసిన కలిగిరి సచివాలయ హెల్త్ సెక్రటరీ బి.కుమారి, భర్త హజరతయ్యలను అభినందించారు. వాత్సల్య యాజమాన్య సేవలన కొనియాడారు.



వాత్సల్యకు నిత్యావసరాలు అందజేస్తున్న పరిమళ

రెడ్‌క్రాస్‌కు శవపేటిక అందజేత

నెల్లూరు(వైద్యం), జూలై 7 : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి నగరంలోని వైవీ లైన్స్ కార్యాలయంలో నూతన కమిటీ కార్యదర్శిగా ప్రమాణం చేయనున్న చలువాది శిరీష ఆదివారం శీతల శవపేటికను అందచేశారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.లక్ష విలువైన ఈ శవపేటికను రెడ్‌క్రాస్ కార్యాలయం జిల్లా కార్యదర్శి మస్తానయ్యకు అందించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్‌లో అంతర్భాగమైన మోర్గో ప్రాజెక్టు కన్వీనర్ సాయిరాంను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ తలసీమియా ప్రాజెక్టు కో కన్వీనర్ షేక్ పర్వీన్, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ శ్రీరంజని, తదితరులు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్‌కు శవపేటిక అందిస్తున్న దాత శిరీష


నగరంలో మోస్తరు వర్షం

● రోడ్లపై నిలిచిన నీరు



రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

నెల్లూరు(సిటీ), జూలై 7 : నైరుతి రుతుపవనాలు కదలికల్లో భాగంగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఆదివారం నెల్లూరులో వర్షం కురిసింది. ఆకాశం నల్లగా మారి కారుమబ్బులు అలుముకోవడంతో గాలులు చెలరేగి వర్షం పడింది. రోడ్లపై మురుగు, వర్షం నీరు నిల్వ చేరింది. దీంతో వాహన చోదకులు, ప్రజలు అవస్థలు పడ్డారు. నైరుతి రుతుపవనాలు అక్టోబరు వరకు ఉండే అవకాశం ఉండటంతో కొన్ని రోజులుగా వర్షం పడుతోంది. కాగా ఆదివారం గాలులకు కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఏర్పడింది.





తిరుమలపై విజిలెన్స్

వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సోదాలు

టీటీడీలో మొదలైన ప్రకంపనలు

తిరుమల కొండపై వైసీపీ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై స్టేట్ విజిలెన్స్ సోదాలు వేగవంతంగా చేస్తోంది. ఐదేళ్లలో విమర్శలొచ్చిన వాటిపైనే కాకుండా ప్రతి విభాగాన్నీ తనిఖీ చేయడంతోపాటు అక్కడి అధికారులు, సిబ్బందిని, బదిలీపై వెళ్లిన వారినీ ప్రశ్నిస్తున్నారు. గతంలో తీసుకున్న నిర్ణయాలు, నిధుల జారీ వంటి వాటిపై ఆరా తీసి.. స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తూ.. ముఖ్యమైన ఫైళ్లను స్వాధీనం చేసుకుంటున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గత సీఎం జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో టీటీడీలో తీవ్రస్థాయిలో అవినీతి కుంభకోణాలు జరిగాయనే విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా భారీగా అవినీతి అక్రమాలు జరిగాయని, వ్యవస్థలను నాశనం చేశారంటూ ఆగ్రహించారు. తిరుమల నుంచే ప్రక్షాళన మొదలు పెడతామని ప్రకటించారు. ఈక్రమంలో 15 రోజులుగా ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన స్టేట్ విజిలెన్స్ కమిటీ.. టీటీడీలో సోదాలు చేయడంతో ప్రకంపనలు మొదలయ్యాయి. సీనియర్ ఎస్పీ కరీముల్లా ఆధ్వర్యంలో దాదాపు 40 మంది సభ్యులతో కూడిన స్టేట్ విజిలెన్స్ బృందం టీటీడీలోని అన్ని విభాగాలను తనిఖీ చేస్తోంది.

టీటీడీపైనే ఫోకస్

శ్రీవారి ఆర్జితసేవా టికెట్లు, వైసీపీ నాయకులకు కేటాయించిన వీఐపీ బ్రేక్, ప్రొటోకాల్ దర్శనాలను పరిమితికి మించి ఎవరికి ఎన్ని ఇచ్చారనే అంశంపై ప్రధానంగా దృష్టి సారించారు. ఇప్పటికే తిరుమలలోని ఈవో కార్యాలయంలో విజిలెన్స్ బృందం పలుమార్లు తనిఖీ చేసి.. ఇద్దరు ముఖ్య అధికారుల స్టేట్‌మెంట్‌ను తీసుకున్నారు. అలాగే కేటాయింపులకు సంబంధించిన పలు ఆధారాలను కూడా సేకరించినట్టు సమాచారం. మరోవైపు వైకుంఠం కాంప్లెక్స్ వద్దనున్న ఆర్జితం కార్యాలయంలోని ఐటీ విభాగంలోనూ సోదాలు చేశారు. ప్రభుత్వం మారిన వెంటనే రికార్డులను తారుమారు చేశారనే ఆరోపణలు ఉన్న క్రమంలో స్వయంగా వెళ్లి డేటాను పొందినట్టు తెలుస్తోంది. అలాగే శ్రీవాణి ట్రస్టు ద్వారా కేటాయించే టికెట్ల కౌంటర్లను కూడా తనిఖీ చేశారు. రోజుకు ఎన్ని టికెట్లు ఇస్తున్నారు, ఎంత నిధులు వస్తున్నాయి, అవి ఏ ఖాతాలో పడుతున్నాయనే అంశాలపై ఆరా తీశారు. శ్రీవారి అన్నప్రసాదాలు, లడ్డూల తయారీకి కొనుగోలు చేస్తున్న ముడి సరుకుల కొనుగోళ్లలో అక్రమాలు, నాణ్యత ప్రమాణాలు పరిశీలించాల్సిన అధికారికి అర్హత ఉందా, లేదా, క్వాలిటీ కంట్రోల్ వింగ్, ల్యాబ్ టెస్టింగ్, హెల్త్ అధికారుల తీరును పరిశీలించి ముఖ్య అంశాలను నమోదు చేశారు. ఎస్టేట్ విభాగం ద్వారా అతిథిగృహాల నిర్మాణం, దుకాణాల లైసెన్స్ రెన్యువల్స్, నగదు బ్యాంకు లావాదేవీలు, డిపాజిట్లు, ఆభరణాల భద్రత, టీటీడీ బోర్డులో టేబుల్ అజెండాగా పనులకు నిధుల మళ్లింపు వంటిపైనా పరిశీలన చేశారు.

ఇంజనీరింగ్ పనులపై..

వైసీపీ ప్రభుత్వంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా ఉన్న భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి.. కమీషన్ల కోసం నిబంధనలను ఉల్లంఘించి మరీ భారీగా ఇంజనీరింగ్ పనులకు నిధులు మళ్లించారనే ఆరోపణలున్నాయి. దాంతో స్టేట్ విజిలెన్స్ బృందం ప్రత్యేకంగా ఇంజనీరింగ్ విభాగంలో సోదాలు చేసింది. ఏ పనులకు నిధులు కేటాయించారు, నిజంగా నిధులు కేటాయించాల్సిన అవసరముందా, ఎంత కేటాయించారు, నిజంగానే కమీషన్లు పొందారా వంటి వాటిపై కూడా విజిలెన్స్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. కోట్లాది రూపాయల పనులను కొందరికే కట్టబెట్టడం, ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు,గత బోర్డు సభ్యులకు ఎలాంటి సంబంధాలు ఉన్నాయి వంటి అంశాలపై ఆరా తీసినట్టు తెలుస్తోంది.

కీలక విభాగాల్లో పనిచేసిన అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు

తనిఖీలు, రికార్డుల స్వాధీనం, స్టేట్‌మెంట్ల సేకరణతో ఐదేళ్లపాటు టీటీడీలోని కీలక విభాగాల్లో పనిచేసిన అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. నాయకులు, ఉన్నతాధికారులు బాగానే ఉన్నారని, తమకు ఏ ఆపద వస్తుందో తెలీక సతమతమవుతున్నారు. మాజీ ఈవో ధర్మారెడ్డికి సన్నిహితంగా ఉండి.. ప్రతి ఫైల్‌ను ముందుకు నడిపించిన అధికారులు ఇప్పుడు విజిలెన్స్ సోదాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నట్టు సమాచారం.

ప్రక్షాళన దైవానుగ్రహం

టీటీడీలో జరిగిన అవినీతి అక్రమాలపై కొరడా ఝళిపించేలా సీనియర్ అధికారులతో రాష్ట్రం ప్రభుత్వం ప్రత్యేక విజిలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేయడం దైవానుగ్రహం. దీనికి శ్రీవారి భక్తుడిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. మాజీ ఈవో ధర్మారెడ్డి కార్యాలయం కేంద్రంగా దందా నడిపించిన అధికారుల వ్యవహారంపై, ఆదాయానికి మించిన ఆస్తుల సంపాదన, సమగ్ర సమాచార పత్రాలను ఆదివారం విజిలెన్స్ ఎస్పీకి అందజేశా. ఐదేళ్లలో ధార్మిక సంస్థకు జరిగిన నష్టాన్ని వివరించా. గతంలో నేను పంపిన సమాచారం ఆధారంగానే సీఎం చంద్రబాబు విజిలెన్స్ బృందాన్ని పంపారు. ధర్మారెడ్డికి సంబంధించిన కొందరు భజనపరులు రికార్డులను మాయం చేసే కుట్రలు చేస్తున్నారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని కోరా. కొంతమంది అధికారులు, అధికారపార్టీ నాయకులు సొంత లాభాల కోసం ఇంజనీరింగ్ విభాగంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయల టెండర్లు పిలవడంలో కీలకపాత్ర పోషించిన సూత్రధారులు, పాత్రధారుల వివరాలను విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లా.


- నవీన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకుడు

క్రీడారంగం పురోగమించేనా?

గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

వైసీపీ హయాంలో క్రీడారంగం జిల్లాలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అందుబాటులో ఉన్న క్రీడాంశాల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటుపరం చేయడంతో పేదలైతే క్రీడలను మరచిపోయారు. నూతన ప్రభుత్వ హయాంలో అయినా క్రీడారంగం పురోభివృద్ధి చెందనుందా..? ఆ దిశగా చర్యలు చేపట్టనుందా..? అంటే ఔననే సంకేతాలు జిల్లా యంత్రాంగం ద్వారా అందుతున్నాయి.

- తిరుపతి(క్రీడలు)



చంద్రగిరిలో ఆగిపోయిన క్రీడా ప్రాంగణం

జిల్లా కేంద్రమైన తిరుపతిలో దాదాపు 20 ఎకరాల్లో శ్రీనివాస క్రీడా సముదాయం ఉంది. ఇందులో కార్యాలయం, ఇండోర్ స్టేడియం (షటిల్‌బ్యాడ్మింటన్, జిమ్, యోగా, బాక్సింగ్ క్రీడలకు అనుకూలంగా ఉంది). వెలుపల ఫ్లడ్‌లైట్లతో కూడిన రెండు టెన్నిస్ కోర్టులు, స్కేటింగ్ రింగ్, స్విమ్మింగ్ పూల్, క్రికెట్‌నెట్ ప్రాక్టీసు స్థలాలున్నాయి. తాత్కాలిక వసతుల మినహా శాశ్వత, అధునాతన సదుపాయాలు లేవు. అలాగే శ్రీకాళహస్తి, సత్యవేడులలో అరకొర ఏర్పాట్లతో క్రీడా ప్రాంగణాలు మాత్రమే ఉన్నాయి.

కోచ్‌లు, సిబ్బంది కొరత

హాకీ, ఫుట్‌బాల్, రెజ్లింగ్, వాలీబాల్, జోడో, స్విమ్మింగ్, స్కేటింగ్‌లకు మాత్రమే కోచ్‌లున్నారు. షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, జిమ్నాస్టిక్, ఖోఖో, అథ్లెటిక్, క్రికెట్ అంశాలకు శిక్షకులు కరువయ్యారు. దీంతోపాటుగా గ్రౌండ్స్‌మెన్స్, ఆఫీసు అటెండర్లు, స్విమ్మింగ్ పూల్ లైఫ్‌గార్డ్స్ స్వీపర్లు, వాచ్‌మెన్ లేకుండా క్రీడా ప్రాంగణాలు కొనసాగుతుండడం గమనార్హం.

ప్రతిపాదనలతో సరి

2022లో తమిళనాడు తరహా జిల్లావ్యాప్తంగా అకాడమీలు, క్రీడా వసతి గృహాల ఏర్పాటు అన్నది ప్రతిపాదనలకే పరిమితమైంది. రూ.52లక్షలతో శ్రీనివాస క్రీడా సముదాయంలో వాణిజ్యసముదాయం నిర్మాణానికి అనుమతులు వచ్చినా నిధులు విడుదల కాలేదు. ఔట్‌డోర్ మైదానాల ఏర్పాటుకు చేసిన ప్రతిపాదన కూడా మరుగున పడిపోయింది. దీంతో డిస్ట్రిక్ట్ అథారిటీ కోచ్‌లు బయట పాఠశాలలు, కళాశాలలో శిక్షణ ఇస్తున్నారు. పే అండ్ ప్లే విధానంతో వసూలైన నగదు కూడా నేరుగా శాప్‌కు చేరడంతో జిల్లా క్రీడాభివృద్ధి కుంటుపడింది. మూడేళ్ల క్రితం అప్పటి పాలకులు స్వార్థంతో ప్రవేశపెట్టిన ఈ విధానం నిష్ప్రయోజనంగానే మిగిలిపోయింది. జిల్లా నుంచి ఏడాదికి దాదాపు రూ.50లక్షల వరకు శాప్‌ఖాతాలో జమ అవుతున్నా.. అక్కడినుంచి వచ్చే నిధులు మాత్రం రూ.18లక్షలే. దీనివల్లే క్రీడారంగం అభివృద్ధి చెందలేకపోతోందని పలువురి క్రీడాభిమానుల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయం.

అర్ధంతరంగా ఆగిన పనులు

గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చంద్రగిరిలో రూ.2.1కోట్లతో ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం ఏర్పాటైంది. అయితే ప్రభుత్వం మారగానే అర్ధంతరంగా పనులు ఆగిపోయాయి. ఇప్పటికీ మొండిగోడలతో దర్శనమిస్తోంది. ప్రాంగణం కూడా నిరుపయోగంగా ఉంటోంది.

కోచ్‌లకు 4నెలలుగా జీతాల్లేవ్

జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో పనిచేస్తున్న కోచ్‌లకు నాలుగు నెలలుగా జీతాలు రాలేదు. దాంతో వారి కుటుంబ పోషణ భారంగా మారిపోయింది. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా స్కీమ్ ద్వారా ఒకరు, శాప్ కోచ్‌లుగా ముగ్గురు (క్రికెట్, టెన్నిస్, హాకీ), ఔట్ సోర్సింగ్‌లో (జూడో, ఫుట్‌బాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్, హాకీ), పే అండ్ ప్లేలో (వాలీబాల్, స్కేటింగ్, రెజ్లింగ్)మొత్తం డజను మంది కోచ్‌లు శిక్షణ అందిస్తున్నారు. కాగా ఖేలో ఇండియా స్కీమ్, శాప్, పే అండ్ ప్లే కోచ్‌లకు మాత్రం నెల నెలా జీతాలు సక్రమంగా అందుతున్నాయి. ఔట్‌సోర్సింగ్ కోచ్‌లకు (ఒక్కొక్కరికి రూ.19,500చొప్పున) మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించిన జీతాలు చెల్లించలేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆప్కాస్ పరిధిలో ఉండడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని తెలుస్తోంది. ఆప్కాస్‌కు మార్చికే కాలపరిమితి ముగిసింది. కొనసాగింపునకు సిఫార్సు చేసినా ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో సాధ్యపడలేదు. నూతన ప్రభుత్వం ఏర్పడి గత నెల చివర్లో ఆప్కాస్ సంస్థకు మరో ఏడాది కాలపరిమితి పొడిగింపు లభించింది. అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, ఇకనైనా తమకు జీతాలు చెల్లించాలని ఆయా కోచ్‌లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నేటినుంచి ఇసుక లభ్యత

తిరుపతి(కలెక్టరేట్), జూలై 7: జిల్లాలో గుర్తించిన స్టాక్ పాయింట్లలో సోమవారం నుంచి ఇసుక లభించనుంది. నూతన విధానంలో ఇసుక కావాల్సిన వారు డీఎంజీ వెబ్‌సైట్‌లోని క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి డిజిటల్ పేమెంట్(ఫోన్‌పే, పేటీఎం, గూగూల్‌పే) ద్వారా చెల్లించాలి. స్టాక్ పాయింట్ వద్ద రశీదు చూపిస్తే ముందు వచ్చిన వారికి ముందుగా అన్న ప్రాతిపదికన ఇసుక కేటాయింపులు జరుగుతాయి. ఆధార్ కార్డు ప్రాతిపదికగా రోజుకు ఒక వ్యక్తికి గరిష్ఠంగా 20 టన్నుల ఇసుక మాత్రమే ఇస్తారు.

స్టాక్ పాయింట్లు.. ధరలు

శ్రీకాళహస్తి డివిజన్‌లో సుబ్బానాయుడు కండ్రిగలో రెండు స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. మెట్రిక్ టన్ను ఇసుక రూ.200 నిర్ణయించారు. పిచ్చాటూరు మండలం అడవి కొడియంబేడు వద్ద టన్నుకు రూ.200, సూళ్లూరుపేట డివిజన్‌లో డీవీసత్రం మామిళ్లపాడు వద్ద స్టాక్‌పాయింట్‌లో మెట్రిక్ టన్ను రూ.465గా నిర్ణయించారు. గూడూరు డివిజన్‌లో వెంకటగిరి మండలం మొగళ్లగుంట స్టాక్ పాయింట్‌లో మెట్రిక్ టన్ను రూ.590గా ధర నిర్ణయించారు.



గదుల దళారీపై లోతుగా విచారణ



దళారీని ప్రశ్నిస్తున్న సీఐ సత్యనారాయణ

తిరుమల, జూలై 7 (ఆంధ్రజ్యోతి):తిరుమలలో వసతి గదుల డిమాండ్‌ను క్యాష్ చేసుకుంటూ కొత్తరకం అక్రమంతో పట్టుబడిన దళారీ నవకిషోర్‌ను తిరుమల టూటౌన్ పోలీసులు వివిధ కోణాల్లో విచారిస్తున్నారు. భక్తుల ఆధార్ జిరాక్స్ తీసుకుని ఫొటో మార్పిడితో గదులు పొందుతూ బ్లాక్‌లో విక్రయిస్తున్న ఇతడిని విజిలెన్స్ వింగ్ అధికారులు పట్టుకుని టూటౌన్ పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. నెల వ్యవధిలోనే దాదాపు 28 గదులు పొందిన ఈదళారీపై కేసు నమోదు చేసిన టూటౌన్ సీఐ సత్యనారాయణ ఆదివారం విచారించారు. గదుల అక్రమాలకు పాల్పడుతున్న దళారులను పట్టుకునేందుకు దాదాపు 25 మందికిపైగా ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఒక దళారీ రెండు నుంచి ఐదు ఫోన్ నెంబర్లు వినియోగిస్తున్నట్టు విచారణలో తేలింది. ప్రభుత్వం మారిన వెంటనే తిరుమలలో దళారీలపై ఉక్కుపాదం మోపింది. విజిలెన్స్‌తోపాటు పోలీసు విభాగం కూడా చర్యలు తీసుకుంటోంది. తొలుత గదుల దళారీలను పూర్తిగా అరికట్టేలా వివిధ రకాల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

రేషన్ మాఫియాకు చెక్ పడేనా?

రేణిగుంట, శ్రీకాళహస్తి, నాయుడుపేట కేంద్రాలుగా దందా

చౌక బియ్యాన్ని కిలో రూ.9-10కి కొని పాలిష్ పట్టించి రూ.30కి విక్రయం

తిరుపతి(నేరవిభాగం), జూలై 7: జిల్లాలో రేషన్ మాఫియాకు అడ్డుకట్ట పడటం లేదు. గోదాముల వద్ద నుంచే ఈ దందా కొనసాగుతోంది. తరుగు రూపంలో భారీగా గోదాముల నుంచే చౌక బియ్యం మాయం చేస్తున్నారు. డీలర్లకు సరఫరా చేస్తున్న సంచుల్లో తూకం తగ్గుతోందని ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. మరోవైపు జిల్లాలో ఎక్కడ రేషన్ బియ్యం పట్టుబడినా మూలాలు మాత్రం రేణిగుంట, నాయుడుపేట, శ్రీకాళహస్తిల్లో ఉంటున్నాయి. ఈ వ్యవహారంలో వైసీపీలోని కొంతమంది కీలక నేతలు ఉండటంతో అధికారులు ఐదేళ్లుగా పట్టించుకోక పోవడంతో మాఫియాకు అడ్డుకట్ట పడటం లేదు. బియ్యం బాగా లేవని కొందరు కార్డుదారులు, డబ్బు అవసరాల కోసం మరికొందరు పేదలు.. ఈ మాఫియా సభ్యులకు కిలో బియ్యాన్ని రూ.9-10కి చొప్పున అమ్ముతున్నారు. ఇలా కొన్న బియ్యాన్ని పాలిష్ పట్టించి.. తిరిగి మార్కెట్లో రూ.30కి విక్రయిస్తూ రేషన్ మాఫియా సొమ్ము చేసుకుంటోంది.



రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనం (ఫైల్ ఫొటో)

తూతూమంత్రంగా తనిఖీలు

అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మాత్రం తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నిన్నమొన్నటి వరకు రేణిగుంట మీదుగా సాగిన దందా.. ఇప్పుడు శ్రీకాళహస్తి, నాయుడుపేట మీదుగా సాగుతున్నట్లు తెలిసింది. ఇక్కడ సేకరించిన బియ్యాన్ని రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. తిరుపతి నగరంలో ప్రధానంగా రైల్వే కాలనీ, మధురానగర్, శివజ్యోతి నగర్, బాలాజీకాలనీ, పేరూరు, ఎస్‌టీవీ కాలనీ, ఎంఆర్‌పల్లె సర్కిల్ నుంచి ఎక్కువగా రేషన్ బియ్యం కొనుగోలు చేసి.. అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఒక్క తిరుపతి నుంచే నెలకు రెండు నుంచి మూడు టన్నుల బియ్యం అక్రమంగా తరలిస్తున్నారంటే జిల్లాలో ఈ దందా ఏ మేరకు జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ రేషన్ మాఫియాకు చెక్ పెట్టాల్సి ఉంది.

రుయాలో స్టాఫ్‌నర్సుపై రోగి దాడి

- తలపై తీవ్రగాయం



బాధితురాలికి చికిత్స - సెక్యూరిటీ అదుపులో దుర్గాప్రసాద్

తిరుపతి(వైద్యం), జూలై 7: స్టాఫ్ నర్సుపై ఓ రోగి దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి తిరుపతిలోని రుయాస్పత్రిలో జరిగింది. మదనపల్లె మండలం రాజానగర్‌కి చెందిన దుర్గాప్రసాద్ విషం తాగడంతో నాలుగు రోజుల కిందట కుటుంబీకులు రుయాకు తీసుకొచ్చారు. ఇక్కడి ఏఎంసీ వార్డులో చికిత్స పొందుతున్నాడు. శనివారం నాటికి కోలుకున్న అతనికి రాత్రి అట్రాసిన్ అనే ఇంజక్షను వేశారు. అప్పటినుంచి మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తిలా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇదే వార్డులోకి స్టాఫ్‌నర్సు యశోద విధులకు హాజరయ్యారు. రోగులకు ఇంజక్షన్లు వేసి.. తన కుర్చీలో కూర్చొన్నారు. ఆ సమయంలో దుర్గాప్రసాద్ వెనుక నుంచి సెలైను పెట్టే ఐవీ స్టాండు తీసి తలపై బలంగా కొట్టాడు. ఆమెకు తీవ్రగాయమైంది. గమనించిన సెక్యూరిటీ వచ్చి అతడిని పట్టుకుని పక్క గదిలోకి తీసుకెళ్లారు. బాధితురాలికి వైద్యులు ఎనిమిది కుట్లు వేయాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ రవిప్రభు వచ్చి.. ఘటనపై విచారణ చేపట్టారు. తొలుత వెస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చినా రోగికి మతిస్థిమితం లేదనే కారణంతో ఫిర్యాదు చేయలేదు. అయితే ఈ విషయం బయటకు రానీయకుండా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని, తమకు రక్షణ లేకుండా పోయిందని సిబ్బంది ఆరోపిస్తున్నారు. దీనిపై సోమవారం అధికారులను నిలదీసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిసింది.

అలిపిరి కాలినడకన ఓవర్‌పాస్ నిర్మాణం జరిగేనా?

మంగళం, జూలై 7: తిరుమలకు అలిపిరి కాలినడక దారిలో వెళ్లే శ్రీవారి భక్తుల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ నిర్మించాలనుకున్న ఓవర్ పాస్(ఫైవంతెన) నిర్మాణానికి ఏపీలో కొలువుదీరిన ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు. చిరుతపులుల దాడుల్లో చిన్నారి మృత్యువాత పడిన ఘటన గతంలో సంచలనం రేపింది. 2023 జూన్ 22న అలిపిరి కాలినడక దారిలో ఏడో మైలు వద్ద చిరుతపల్లి కౌశిక్ అనే బాలుడిపై దాడి చేసి గాయపరిచింది. బాలుడు అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన జరిగిన రెండు నెలలకే ఆగస్టు 11వ తేదీన నడిచి వెళుతున్న లక్షిత అనే బాలికపై లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో చిరుత దాడి చేసి.. సమీప అటవీప్రాంతంలోకి లాక్కెళ్లి చంపేసింది. దాంతో అప్పటి టీటీడీ అధికారులు సాయంత్రం ఐదు గంటల తర్వాత కాలినడక దారిని మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యగా ఏర్పాటు చేసిన బోన్లలో ఆరు చిరుతపులులు పట్టుబడ్డాయి. అయితే కాలినడక దారిలో భక్తులు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని చెబుతూ మైకులను టీటీడీ ఏర్పాటు చేసింది. అలాగే రక్షణ కోసం భక్తులకు వెదురు కర్రలు కూడా అందజేసింది. ఈ సమయంలోనే ఏడో మైలు నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు ఓవర్‌పాస్ (ఫైవంతెన) ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ముందుకొచ్చింది. చిన్నారులపై చిరుతపులులు దాడి చేసిన సంఘటనా స్థలాన్ని వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా బృందం పరిశీలించింది. ఓవర్‌పాస్‌తోపాటు జంతువులు తిరిగేందుకు వీలుగా అండర్‌పాస్.. అలాగే కాలినడక మార్గానికి రెండువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నిపుణుల బృందం సూచించింది. దీనికి దాదాపు రూ.50కోట్లు ఖర్చు అవుతుందని అంచనా కూడా వేసింది. ఈ వంతెన వల్ల జంతువుల నుంచి కూడా భక్తులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని.. అలాగే వన్యప్రాణులకు కూడా భక్తుల నుంచి ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొంది. దాదాపు ఎనిమిది నెలల క్రితమే ప్రతిపాదనలు టీటీడీకి వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అందజేసింది. కానీ టీటీడీ ఇప్పటి వరకు స్పందించిన దాఖలాలు లేవు. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఇప్పటికైనా ఈ ప్రతిపాదనలపై టీటీడీ తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.





ఓవర్ పాస్ నిర్మాణం జరగాల్సిన ప్రదేశం

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి : విజయశ్రీ



తైక్వాండో పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న విజయశ్రీ

నాయుడుపేట, జూలై 7: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. పట్టణంలోని షాదీమంజిల్‌లో ఆదివారం జిల్లాస్థాయి తైక్వాండో పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు చిన్నతనం నుంచే విద్యతోపాటు క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నాయుడుపేటలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు రఫి, ఉయ్యాల ప్రవీణ్, రాజేష్, పార్థసారథి, కుబేరు మణి, పి. భాస్కర్, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న నాయకులు

నాయుడుపేట టౌన్, జూలై 7: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సంపత్‌కృష్ణ తెలిపారు. పట్టణంలోని ఎల్ఎసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం తిరుపతి, నెల్లూరు ఉమ్మడి జిల్లాల సంయుక్త కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం వెంకటేశ్వర్లుతోపాటు గౌరవ అధ్యక్షుడిగా బి.రవికుమార్, ప్రధాన కార్యర్శిగా విజయకుమార్, జాయింట్ సెక్రటరీగా చెంచయ్య, కోశాధికారిగా సూర్యారావు, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా షేక్ జాహిదా, ప్రధాన కార్యదర్శిగా శ్రావణి ఏకగ్రీవంగా ఎంపికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు తెలిపారు. అనంతరం వెంకటేశ్వర్లకు శాలువాకప్పి, పూలమాలతో సన్మానించారు.

తాళమ్మకు ప్రత్యేక పూజలు



గూడూరు అర్బన్, జూలై 7: గూడూరు గ్రామదేవత తాళమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముత్యాలమ్మకు ఆదివారం పూజలు



చిల్లకూరు, జూలై 7: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేకపూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టారు.

గుర్రప్ప స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

డక్కిలి, జూలై 7: మండలంలోని తిమ్మాయపాళెంలోని గుర్రప్ప ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పొంగించి భక్తిశ్రద్ధలతో స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

కోటమ్మకు పుష్పాలంకరణ



కోట, జూలై 7: గ్రామదేవత కోటమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా మండలాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం

పెళ్లకూరు, జూలై 7: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఉచిత ఇసుక విధానాన్ని మండలంలో పారదర్శకంగా అమలు చేస్తామని తహసీల్దార్ కేవీఆర్పీ ప్రసాద్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మార్గదర్శకాలను అనుసరించి రెవెన్యూ, పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శాఖల సమన్వయంతో పని చేస్తాయని మండల పరిధిలోని స్వర్ణముఖినదిలో ఏర్పాటు చేయనున్న రీచ్‌లను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఇసుక అవసరమైన ప్రతి ఒక్కరూ ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల పరిధిలో ఏర్పాటు చేయనున్న రీచ్‌ల వద్ద గట్టి నిఘా ఉంటుందన్నారు. కాగా స్వర్ణముఖిదిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తాగు, సాగునీటి బోర్లు పాయింట్ల ప్రాంతాల్లో తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజా విజ్ఞప్తుల దినాన్ని సద్వినియోగం చేసుకోండి

గూడూరు, జూలై 7: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా విజ్ఞప్తుల దినాన్ని నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు వారి సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతగా ఓడూరు

చిల్లకూరు, జూలై 7: మండలంలోని ఏరూరులో నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ టోర్నీలో ఓడూరు జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఓడూరు- మోమిడి జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేపట్టిన ఓడూరు జట్టు నిర్ణీత 8 ఓవర్లల్లో 81 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన మోమిడి జట్టు నిర్ణీత 8 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 69 పరుగులు చేసి లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది.

10న అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల, జూలై 7(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఈనెల 10వ తేదీన అయోధ్యకాండ 12వ విడత అఖండ పారాయణం జరగనుంది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఎస్వీ వేద విజ్ఞానపీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు, జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం పండితులు పాల్గొననున్నారు. అయోధ్యకాండలోని 45 నుంచి 49 సర్గలలోని 141 శ్లోకాలను పారాయణం చేస్తారు. ధర్మగిరి వేదవిజ్ఞానపీఠం పండితులు రామానుజాచార్యులు, అనంత వేణుగోపాల్ శ్లోక పారాయణం చేస్తారు. ఎస్వీబీసీలో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.

కాళంగిని కాటేస్తున్న కాలుష్యం

నిద్రమత్తులో నీటిపారుదల శాఖ

సూళ్లూరుపేట, జూలై 7: నియోజకవర్గంలో వేలాది ఎకరాలకు సాగునీరందించే రైతుల వరప్రసాదిని కాళంగి నది కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమ ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటిన కాళంగి నేడు కాలుష్యం కాటేస్తుండడంతో నీరంతా కలుషితంగా మారిపోయి ప్రమాదంలో పడింది.

తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల రైతులు వేలాది ఎకరాల్లో కాళంగి నీటి పైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ఇటు సాగునీరే కాకుండా సూళ్లూరుపేట పట్టణంలో వేసవిలో కాళంగి నది తాగునీటికి ఎంతో ఉపయోగపడుతోంది. దీనికి అనుసంధానంగా నెర్రికాలువ, పాముల కాలువ, పుచ్చాకాలువ ఉన్నాయి. ఈ కాలువల మీదుగా దాదాపు 18 చెరువులకు నీరందుతోంది. జిల్లాలోని కాళంగి నుంచి ప్రారంభమయ్యే నది బీఎన్‌కండ్రిగ మండలం మీదుగా ప్రవహించి సూళ్లూరుపేట పట్టణ నడిబొడ్డు గుండా తడ మండలం వాటంబేడు వద్ద ముగుస్తుంది. ఇంతటి చరిత్ర ఉన్న కాళంగి నది మనుగడ నేడు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. సూళ్లూరుపేట పట్టణంలోని హోలీక్రాస్ సమీపంలో కాళంగిని ఆనుకొని డంపింగ్ యార్డు ఉంది. పట్టణంలో వినియోగించే తడి, పొడి చెత్త మొత్తం డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. వేలాది టన్నుల చెత్తంతా నదిలోకి జారీ నీరంతా కలుషితమవుతోంది. ప్రస్తుతం కాళంగిలో ఎక్కడ చూసినా



కాలువలోకి జారుతున్న డంపింగ్ యార్డు వ్యర్థాలు

ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు, బాటిళ్లు చేరుతున్నాయి. ఇటు తాగు అటు సాగు నీటికి ఉపయోగించే కాళంగి నీరు నేడు రంగు మారింది.

పట్టించుకోని అధికారులు...

నదిని పరిరక్షించాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారు. రైతులు, ప్రజలు పలుసార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. డంపింగ్ యార్డును కాళంగి నది కాలువ ప్రాంతం నుంచి తరలించాలని అనేకసార్లు విన్నవించుకున్నా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధుల్లో చలనం లేదు. ఒకప్పుడు ఏడాది పొడవునా నీరుండే కాళంగి నేడు వర్షాకాలంలోనే నీరు పోరుతోంది.

నదిలో కలుస్తున్న మురుగు

చెత్త, వ్యర్థాలే కాకుండా పట్టణ మురుగునీరు పలుచోట్ల నదిలో కలుస్తోంది. దీనికి తోడు వాటంబేడు వద్ద పులికాట్‌కు, కాళంగికి మధ్య ఉన్న గ్రాయిన్ దెబ్బతినడంతో భూగర్భ జలాలు ఉప్పుగా మారిపోతున్నాయి. దీంతో సాగు నీరందక రైతులు లబోదిబోమంటున్నారు. ఇకనైన సంబంధిత అధికారులు కాళంగిని కాలుష్య కోరలనుంచి కాపాడాల్సిన అవసరం ఎంతైన ఉంది.



నదిలో ప్రవహిస్తున్న రంగు మారిన నీరు

ఎండమావిగా ప్రభుత్వ వైద్య సేవలు

బాలాయపల్లి పీహెచ్‌సీలో రోజురోజుకు తగ్గుతున్న ఓపీలు



బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం - రోగులు రాక ఖాళీగా ఉన్న సిబ్బంది - వార్డులో మంచం కింద పేర్చిన అట్టపెట్టెలు

బాలాయపల్లి, జూలై 7: మండలంలోని పేదలకు ప్రభుత్వ వైద్య సేవలు ఎండమావిగా తయారయ్యాయి. 24 పంచాయతీలకు వైద్య సేవలందించేందుకు బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలు నామమాత్రంగా అందుతున్నాయి. దీంతో ఆరోగ్యకేంద్రానికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 40వేల మంది జనాభా ఉన్నారు. బాలాయపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అలసత్వంతో వైద్యసేవలు అందడంలేదు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులు, ఆర్‌ఎంపీలను గ్రామీణులు ఆశ్రయించాల్సిన దుస్థితి. ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులున్నారు. ఒకరు 104 వాహనంలో గ్రామాలకు వెళ్లాల్సి ఉండగా మరొకరు ఆసుపత్రిలో ఉండి రోగులను పరీక్షించి వైద్యం అందించాల్సి ఉంది. అయితే 104 వాహనం వీలును బట్టి వెళ్లడం పరిపాటిగా మారిందని పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. బాలాయపల్లిలో ఉన్న ఆసుపత్రి మండలంలోని కొన్ని గ్రామాలకు దూరంగా ఉండడంతో గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి చొరవతో జయంపుకు ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయించారు. ఆసుపత్రి నిర్మాణాలు చేపట్టేవరకు ప్రజలు ఇబ్బంది పడకుండా జయంపులో ఉండి వైద్యసేవలు అందించేందుకు ఓ వైద్యురాలిని నియమించారు. అయితే జయంపులో వైద్య సేవలు అందించాల్సిన వైద్యురాలు అక్కడ ఆసుపత్రి ఏర్పాటుకు భవనంలేక పోవడంతో బాలాయపల్లి ఆసుపత్రిలోనే ఉంటున్నారు. ముగ్గురు వైద్యులు ఉన్న ఈ ఆరోగ్యకేంద్రంలో రోజుకు 50 నుంచి 70 మందికి వైద్య పరీక్షలు అందించిన దాఖలాలు లేదు. గతంలో సుమారు 150 నుంచి 200 వరకు వస్తున్న ఓపి ప్రస్తుతం 70కి మించి లేదంటే వైద్యులు ఎలా సేవలు అందిస్తున్నారో ఇట్టే అర్థమవుతుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశుగ్రాసంతో దాణా ఖర్చు తగ్గించుకోవచ్చు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ

గూడూరు, జూలై 7: పాడిరైతులు పశుగ్రాస రకాలను సాగు చేసి వినియోగించుకోవడం ద్వారా దాణా ఖర్చులను ఆదా చేసుకోవచ్చని పశు సంవర్థక శాఖ ఏడీ డాక్టర్ సురేష్ అన్నారు. ఆదివారం ప్రాంతీయ పశువైద్యశాలలో పశుగ్రాస వారోత్సవాలను ప్రారంభించి పాడి రైతులకు పశుగ్రాసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... పాడిరైతులు ఏకవార్షిక రకాలైన మొక్కజొన్న, జొన్న, సజ్జ, బహువార్షికాలైన పారాగడ్డి, సూపర్ నేపియర్ తదితర జాతి రకాల పశుగ్రాసాలను సాగు చేసుకోవచ్చన్నారు. దీని ద్వారా దాణాలో పోషక విలువలు పెరిగి పాల ఉత్పత్తి పెరగడంతోపాటు దాణా ఖర్చులు తగ్గుతాయన్నారు.

కూటమికి రుణపడి ఉంటాం



చంద్రబాబు, పవన్, పాశిం చిత్రపటాలకు దివ్యాంగుల పాలాభిషేకం

కోట, జూలై 7: పించన్‌ను రూ.6వేల చేసి అండగా నిలిచిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు రుణపడి ఉంటామని దివ్యాంగులు చెప్పారు. కోట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో ఆదివారం వీడబ్ల్యూడీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులు పించన్ పెంపుపై సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్, పాశిం చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. దివ్యాంగుల అసోసియేషన్ మండల అధ్యక్షుడు జి.కృష్ణ, ఉపాధ్యక్షుడు వి.సుధీర్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి టి.కోటేశ్వరరావు, సీనియర్ జనసేన నాయకుడు అల్లంబాబు, పి.మల్లికార్జున్, రమేష్, శ్రీనివాసులు, కోటయ్య, సంధాని, సుబ్బారావు, పరుశురామయ్య, హరీష్ తదితరులు ఉన్నారు.

వేద వ్యాసుడిని గురువుగా పూజించాలి: ఆర్‌ఎస్‌ఎస్

కోట, జూలై 7: వేదాలు, ఉపనిషత్తులు రాసిన వేదవ్యాస భగవానుడిని ప్రతి భారతీయుడు గురువుగా భావించి పూజించాలని ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ సంచాలకుడు అన్నారు. కోటలోని చిన్మయామిషన్, విద్యానగర్‌లోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురుపూర్ణిమను పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా సంఘ్ చాలక్ పి.ఆనంద్‌రెడ్డి, ఉపాధ్యాయ ప్రముఖ్ ఏవెంకటరమణయ్య, కోటేశ్వరరావు, ధనంజయలు ప్రత్యేక పూజలు చేశారు. వేదవ్యాసుడు రాసిన వేదాలు చదివి మానవ విలువలను, సదాచారాలను పెంపొందించాలన్నారు. గురుపూర్ణిమను పురస్కరించుకొని ప్రతి గ్రామంలో ఉత్సవాలు జరుగుతాయన్నారు.

పదవీ విరమణతో బాధ్యత తీరిపోదు

కోట, జూలై 7: ఉద్యోగులు పదవీ విరమణ అయిన తరువాత వారు ఎన్నుకున్న లక్ష్యం, బాధ్యతలు తీరవని తుదిశ్వాస వరకు సేవలను సమాజానికి ఉపయోగపడాలని అంబేడ్కర్ బాలుర గురుకులం ప్రిన్సిపాల్ ఏ. వెంకటేశ్వర్లు అన్నారు. కోటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల అటెండర్‌గా పదవీ విరమణ పొందిన శివధానం శివకుమార్‌కు ఆదివారం అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని గురుకులాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది శివకుమార్ దంపతులను జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు.

కొత్తగుంటను కమ్మేస్తున్న కాలుష్యం



కొత్తగుంట సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన కోళ్ల వ్యర్థాలు - కమ్మీల కోసం వైర్లను తగులబెట్టడంతో వెలువడుతున్న దట్టమైన పొగ

చిట్టమూరు, జూలై 7: మండల కేంద్రమైన చిట్టమూరులోని కూడలి ప్రాంతమైన కొత్తగుంట కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఎటూ చూసినా రోడ్డుకు ఇరువైపులా కుళ్లిన కోళ్ల వ్యర్థాలే కనబడుతున్నాయి. వ్యర్థాలను మూటలు కట్టి పడేయడంతో చెదురుమదురుగా పడుతున్న వర్షం కారణంగా దుర్వాసన వెదజల్లుతోంది. కొత్తగుంట నుంచి కోగిలి రోడ్డు, సబ్‌స్టేషన్, చిట్టమూరు చెరువు కట్ట వైపు వెళ్తున్న బైపాస్ రోడ్డు ఇరువైపులా ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఆయా రహదారుల్లో వెళ్లే ప్రజలు వాసన భరించలేక ముక్కులు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా పాత సమాన్ల నుంచి ఇనుప రేకులు, వైర్ల నుంచి అల్యూమినియం, రాగి తీగల కోసం వైర్లను తగుల బెడుతున్నారు. అలాగే ప్రతి ఆదివారం చేపల విక్రయదారులు ఆ వ్యర్థాలను, కడిగిన నీటిని గ్రామంలోనే పారబోస్తుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం అధికారులు ఈ మార్గంలోనే తిరుగుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి వ్యర్థాలను నియంత్రించేలా చర్యలు చేపట్టాలని కొత్తగుంటవాసులు కోరుతున్నారు.

ప్రజల రుణం తీర్చుకుంటా: విజయశ్రీ



వర్షంలో కొనసాగుతున్న విజయోత్సవ ర్యాలీ

సూళ్లూరుపేట, జూలై 7: టీడీపీ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట పట్టణంలో ఆదివారం విజయోత్సవ ర్యాలీ జరిగింది. కచ్చేరి వీధిలోని రైల్వే గేటు నుంచి సాయంత్రం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్సీ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ర్యాలీ ఆసాంతం బాణసంచా పేల్చి, పూలవర్షం కురిపించారు. ర్యాలీ కూరగాయల మార్కెట్ సెంటర్ వద్దకు చేరుకుంటుండగా వర్షం ప్రారంభమైంది. దీంతో ర్యాలీని నిలిపివేసి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అభినందన సభకు అందరూ చేరుకున్నారు. ఈ సందర్భంగా నెలవల విజయశ్రీ మాట్లాడుతూ... అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నెలవల రాజేష్, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రమేష్, ఏజీ కిషోర్, సీనియర్ నాయకుడు తిరుమూరు సుధాకర్ రెడ్డి, బీసీ నాయకుడు పెరుమాల్, మాధవనాయుడు, జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, బీజేపీ నాయకులు ఆదినారాయణ రెడ్డి, కోటయ్య, నూతలపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు

రూ. 3.28 లక్షల సరుకు సీజ్



వెంకటగిరి పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ

వెంకటగిరి టౌన్, జూలై 7: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించాలని ఏడీఏ ఎన్.పీ.ఎల్లప్ప దుకాణ యజమానులకు సూచించారు. ఆదివారం వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో పురుగు మందుల దుకాణాలను ఆయన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనుమతి లేని పురుగుమందులను విక్రయించ రాదన్నారు. ఎమ్మార్పీకే విక్రయంచకపోతే లైసెన్సు రద్దు చేయడమే కాకుండా 6ఏ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పలు షాపుల్లో అనుమతి పత్రాలు లేకుండా ఫాం'O' లైసెన్సు కానందున రూ.3.28లక్షల ఎరువులను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి జీవానందం, వెంకటగిరి ఏడీఏ నాగార్జున సాగర్, ఈఎస్ వరప్రసాద్, శిరీషా పాల్గొన్నారు.

గునపాడులో రక్తదాన శిబిరం



చిట్టమూరు, జూలై 7: మండలంలోని గునపాడులో ఆదివారం రక్తదాన శిబిరం జరిగింది. ఉపాధ్యాయులు, యువత ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 41 మంది రక్తం దానం చేశారు. నెల్లూరు రెడ్ క్రాస్ సంస్థ రక్తం సేకరించింది. కె.రామిశెట్టి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో వాకాడు ఎంఈవో నసీం అలీ, రెడ్ క్రాస్ మోటివేటర్ మధుసుదన్‌రావు, మురళి, గోపి, కస్తూరిబాబు, భాస్కర్, మల్లికార్జున్, హరికృష్ణారెడ్డి, నారాయణ, అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర మంత్రులను కలిసిన బీజేపీ నాయకుడు



గూడూరు, జూలై 7: విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం గూడూరుకు చెందిన బీజేపీ నాయకుడు దయాకర్ కేంద్రమంత్రి బి.శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

పంట రుణాలు.. మరింత ఆలస్యం!

చిత్తూరు కలెక్టరేట్, జూలై 7: ఎన్నికలు.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడం తదితర కారణాలతో పంట రుణాలు మరింత ఆలస్యం కానున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో సుమారు ఐదు లక్షల మంది రైతులకు వివిధ బ్యాంకుల ద్వారా ప్రభుత్వం పంట రుణాలను అందిస్తుంది. కొత్తప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, సహకార బ్యాంకుల పాలక మండళ్లు రద్దయ్యాయి. కొత్త పాలకవర్గాలను నియమించాకే పంటరుణాలపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ జూన్ నుంచే ప్రారంభమైంది. ఇప్పటికే వాణిజ్య, గ్రామీణ, సహకార బ్యాంకుల్లో పంటరుణాల మంజూర్లు చురుగ్గా కొనసాగాలి. ప్రస్తుతం ప్రధాన బ్యాంకుల్లో ఏ బ్యాంకు ద్వారా కూడా పంట రుణాలు అందలేదు. ఈ సంవత్సరం పంటరుణాల మంజూరుకు సంబంధించి జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఆధ్వర్యంలో వివిధ బ్యాంకుల, జిల్లా అధికారులు ఫిబ్రవరి నెలలో సమావేశమై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జాబితా ఖరారు చేశారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ఆమోదానికి పంపారు. అక్కడినుంచి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జాబితా వివిధ మార్పుల తర్వాత ఎన్నికలకు ముందే జిల్లాకేంద్రానికి చేరింది. ఎన్నికల కోడ్, ఫలితాల విడుదల, కొత్త ప్రభుత్వం ఏర్పాటు, కలెక్టర్ల బదిలీలు తదితర కారణాలతో ఈ జాబితాపై నిర్ణయం తీసుకోవడం ఆలస్యమైంది. 2023-24లో రూ.13వేల కోట్ల పంటరుణాల పంపిణీకి బ్యాంకర్ల కమిటీ లక్ష్యం నిర్ణయించగా, రూ.14వేల కోట్ల పంపిణీ జరిగినట్లు బ్యాంకువర్గాలు తెలిపాయి. ఈ సంవత్సరంలో పంట రుణాల లక్ష్యంపై త్వరలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం జరిపి నిర్ణయం తీసుకుంటామని ఎల్డీఎం ఎ.హరీష్ ఆదివారం తెలిపారు.

14నుంచి మాతాపరమేశ్వరిదేవి తిరునాళ్ల



గూడూరు, జూలై 7: పట్టణంలోని అరుంధతీయపాళెంలో మాతా పరమేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 14నుంచి 21వ తేదీ వరకు అమ్మవారి తిరునాళ్లను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఆలయం వద్ద తిరునాళ్లకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. తిరునాళ్లలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

9న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

గూడూరు అర్బన్, జూలై 7: స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈనెల 9వ తేదీన రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు మహబూబ్‌బాషా ఆదివారం పేర్కొన్నారు. సభ్యులందరూ సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.